# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :188 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: గురువారం 26-09-2024 | పేజీలు:4 వెల: 2.00


## జానీ మాస్టర్‌కు నాలుగు రోజులు పోలీసు కస్టడి

హైదరాబాద్ : ప్రముఖ టాలీవుడ్ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌కి నాలుగు రోజుల కస్టడీ విధిస్తూ రంగారెడ్డి కోర్టు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. లైంగిక వేధింపు ఆరోపణలపై రిమాండ్ ఖైదీగా చంచల్‌గుడ జైలులో జానీ మాస్టర్ ఉన్న సంగతి విదితమే. 21 ఏళ్ల సహాయ కొరియోగ్రాఫర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నార్సింగ్ పోలీసులు పోక్సో చట్టం కింద అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.

కస్టడీని కోరిన నార్సింగ్ పోలీసులు

పోక్సో చట్టం కింద అరెస్టయిన జానీ మాస్టర్‌ను విచారణ నిమిత్తం ఐదు రోజులపాటు పోలీసు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ రంగారెడ్డి జిల్లా కోర్టులో పిటీషన్ వేశారు. ఈ పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిపిన రంగారెడ్డి కోర్టు తీర్పును బుధవారానికి వాయిదా వేసింది. నాలుగు రోజులపాటు పోలీసు కస్టడీకి అనుమతి ఇస్తూ జడ్జి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

## బిసి ఉద్యమాన్ని బలోపేతం చేస్తా...



హైదరాబాద్,సెప్టెంబర్25: బీసీ ఉద్యమం బలోపేతానికే తాను రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ఉద్యమం చేయబోతున్నట్లు చెప్పారు. అందుకే తాను రాజ్యసభను వదులుకున్నానని అన్నారు. దీనిద్వారా దేశవ్యాప్తంగా ఉన్న బీసీలకు న్యాయం జరగాలన్నారు. విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ పద్ధతుల్లో ఉద్యమం చేస్తాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు న్యాయం చేయడం లేదు. బీసీల తరపున చట్టసభల్లో ప్రశ్నించినా సమాధానం రాలేదు. ఇంకా నాలుగేళ్ల పదవీకాలం ఉన్నా బీసీల గురించి ఆలోచించే ఎంపీ పదవికి రాజీనామా చేయాల్సివచ్చింది. ప్రజా ఉద్యమం, బీసీ ఉద్యమమే నా కార్యాచరణ. రాజ్యాధికారంలో వాటాతో పాటు చట్టసభల్లో 50 శాతం సీట్లు ఇవ్వాలి. అసెంబ్లీ ఎన్నికల్లో 21 సీట్లు ఇచ్చారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచాలి. బీసీల కోసం చాలా త్యాగాలు చేయాల్సివస్తుంది. గ్రామ, మండల, జిల్లా కమిటీలు వేయాలని కోరుతున్నాం. అన్ని పార్టీల వారు ఈ ఉద్యమంలోకి రావాలి. చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు సాధించడమే నా జీవిత లక్ష్యం. దీనికోసం ప్రతి బీసీ బిడ్డా పోరాడాలని ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. మరోవైపు ఆర్.కృష్ణయ్యను ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కలిశారు. బీసీలకు న్యాయం జరగాలని.. అందుకు తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. కాంగ్రెస్ పార్టీలోకి రావాలని కృష్ణయ్యను ఆయన ఆహ్వానించారు.

### రాబోయే 48 గంటల్లో తెలంగాణలో భారీ వర్షాలు..!

హైదరాబాద్ : గత నాలుగైదు రోజుల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా వానలు దంచికొడుతున్న సంగతి తెలిసిందే. మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా రాబోయే 48 గంటల్లో రాజధాని హైదరాబాద్‌తో పాటు తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ - మల్కాజ్‌గిరి,వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట,కామారెడ్డి,మహబూబ్‌నగర్,నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలో రాబోయే 48 గంటల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

## మూసీ సుందరీకరణ పేరుతో వేల కోట్ల కుంభకోణం..

హైదరాబాద్ : హైదరాబాద్ మహా నగరాన్ని ఒక విశ్వనగరంగా తీర్చిదిద్దిన దృఢ కసంకల్పంతో తెలంగాణ సీఎం కేసీఆర్ తొలి ప్రతి రోజు జీహెచ్‌డి పరిధిలో ప్రతి ఉత్పత్తి అయ్యే 20 కోట్ల లీటర్ల మురికి నీటిని సంపూర్ణంగా శుద్ధి చేయాలనే ఉద్దేశంతో రూ. 4 వేల కోట్లతో 31 ఎస్టీపీలకు శ్రీకారం చుట్టామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. ఫతేనగర్ ఎస్టీపీని సందర్శించిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఇండియాలోనే 100 శాతం సీవరేజ్ ట్రీట్‌మెంట్ చేసే ఏకైక నగరంగా హైదరాబాద్‌ను మార్చాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం తీసుకున్నామ'ని కేటీఆర్ గుర్తు చేశారు. ఇవాళ కూకట్‌పల్లి ఫతేనగర్‌లో ఏర్పాటు చేసిన 133 ఎంఎల్‌డీల ఎస్టీపీ ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఇది ప్రస్తుతం ట్రయల్ రన్ దశలో ఉంది. ఎస్టీపీల సందర్శనలో ఇది మొదటి అడుగు మాత్రమే.. ఉప్పల్ నల్ల చెరువు, ఎల్‌బీనగర్, కుత్బుల్లాపూర్, రాజేంద్రనగర్‌లో ఏర్పాటు చేస్తున్న ఎస్టీపీలను కూడా త్వ రలోనే సందర్శిస్తాం అని కేటీఆర్ పేర్కొన్నారు.

మూసీ శుద్ధి వెనుక ప్రభుత్వ అస్సలు ఉద్దేశం వేరే ఉంది..

ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీరు మూసీలోకి వెళ్తుంది. 94 శాతం స్వచ్ఛమైన నీరు వెళ్తున్నప్పుడు మూసీ శుద్ధి ఎందుకు..? కొత్తగా మీరు శుద్ధి చేసేదేమీ లేదు. మూసీ ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి, మంత్రుల మాటలకు పొంతన లేదు. సీఎం రూ. లక్షా 50 వేల కోట్లు అని అంటాడు. మంత్రులేమో రూ. 50 వేల కోట్లు, ఇంకొందరేమో రూ. 70 వేల కోట్లు అని మాట్లాడుతున్నారు. ఈ మాటలను చూస్తుంటే అనుమానం వస్తుంది. మూసీ శుద్ధి వెనుక ప్రభుత్వ అస్సలు ఉద్దేశం వేరే ఉంది అనే అనుమానం ప్రజల్లో కలుగుతుందని కేటీఆర్ చెప్పారు.

ఇప్పుడు మీరు చెప్పిన అబద్దాలు అని తేలిపోయింది..

హైదరాబాద్‌లో ఒక్క డబుల్ బెడ్రూం ఇల్లు కట్టలేదు అని గతంలో రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క మాట్లాడారు. నాడు తలసాని శ్రీనివాస్ యాదవ్ దగ్గరుండి భట్టికి డబుల్ బెడ్‌రూం ఇండ్లు చూపించారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో 12 వేల ఆక్రమణలు ఉన్నాయని సీఎం చెప్పారు. వాటిని తొలగించి బాధితులకు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామని చెప్పారు. మేం డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టకపోతే మీరు ఎక్కడ్నుంచి ఇస్తున్నారు..? ఇప్పటిదాకా మీరు చెప్పినవి



అబద్దాలు అని తేలిపోయింది. కేసీఆర్ చేసిన మంచి పనని ఒప్పుకోక తప్పట్లేదు అని కేటీఆర్ స్పష్టం చేశారు.

పబ్లిసిటీ స్టంట్లతో ఎక్కువ రోజులు మాయ చేయలేరు..

స'బిత ఇంద్రారెడ్డి కాపీ14 వేల ఎకరాలు ఫార్మా సిటీ కోసం సేకరిస్తే దాన్ని రద్దు చేసి ఫ్యూచర్ సిటీ అని, ఇంకోటి అని రకరకాల డ్రామాలు ఆడుతున్నారు. మూసీకి సంబంధించి మూసీ సుందరీకరణ పేరుతో కొత్త నాటకాలు ఆడుతున్నారు. మీరు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయండి. రైతుభరోసా అందించండి.. పబ్లిసిటీ స్టంట్లతో ఎక్కువ రోజులు మాయ చేయలేరు. హైదరాబాద్ ప్రజలకు మేం చేసిన పని బాగా తెలుసు. లింక్ రోడ్లు, ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు, స్మశాన వాటికలు, లైబ్రరీలు కట్టాం. ఇవన్నీ ప్రజల దృష్టిలో ఉన్నాయని కేటీఆర్ అన్నారు.

పాకిస్తాన్ కంపెనీలకు మూసీ సుందీకరణ

మూసీ సుందీకరణ పేరుతో కుంభకోణం జరుగుతంది. దాన్ని కూడా బయటకు తీస్తాం. పాకిస్తాన్‌కు చెందిన కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇవన్నీ ప్రజలను గమనిస్తున్నారు. భవిష్యత్‌లో అన్ని విషయాలను ప్రజల దృష్టికి తీసుకువస్తాం. పేదోళ్లకు ఒక న్యాయం.. పేదోళ్లకు ఒక న్యాయం. పేదోళ్లను బుల్డోజర్ల కింద నలిపేస్తున్నారు. బాధితులకు డబుల్ బెడ్రూం ఇండ్లను కేటాయించండి.. ఆలస్యం చేయకండి. పుస్తకాల కోసం వేద శ్రీ మాట్లాడిన మాటలు వింటే గుండె బరువెక్కిపోయిందని కేటీఆర్ ప్రకటించారు.

## ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ కు కేజ్రీవాల్ లేఖ

న్యూఢిల్లీ, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్‌కు లేఖ రాశారు. తన పదవీ విరమణ సహా 5 అంశాలపై సమాధానం చెప్పాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశారు. తాను రాజకీయ పార్టీ నాయకుడి హోదాలో కాకుండా సాధారణ పౌరుడిగా లేఖ రాశానని కేజ్రీవాల్ లేఖలో పేర్కొన్నారు. భగవత్ సమాధానం చెబుతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలో నెలకొన్న పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు." బీజేపీ కేంద్ర ప్రభుత్వం దేశాన్ని, దేశ రాజకీయాలను ఏ దిశలో తీసుకెళ్తోందో అది యావత్ దేశానికి హానికరం. ఇది ఇలాగే కొనసాగితే మన ప్రజాస్వామ్యం అంతమవుతుంది. మన దేశం అంతమవుతుంది. పార్టీలు వస్తాయి, పోతాయి, ఎన్నికలు వస్తాయి, పోతాయి, నాయకులు వస్తారు, పోతారు, కానీ భారతదేశం ఎప్పుడూ దేశంగానే ఉంటుంది. ఈ దేశపు త్రివర్ణ పతాకాన్ని ఎప్పుడూ సగర్వంగా ఆకాశంలో ఎగురవేయడం మనందరి బాధ్యత." అన్నారు. భారత ప్రజాస్వామ్యాన్ని రక్షించడం, బలోపేతం చేయడం మాత్రమే తన ఉద్దేశమని కేజ్రీవాల్ అన్నారు. తాను అడిగే ప్రశ్నలు ప్రజల మదిలో ఉన్నాయని అన్నారు. ఈడీ-సీబీఐ అత్యాశ, బెదిరింపులతో ఇతర పార్టీల నేతలను ఓడిస్తూ ప్రభుత్వాలను కూల్చేస్తున్నారని కేజ్రీవాల్ ఆరోపించారు. నిజాయితీతో అధికారం పొందడం మీకు లేదా ఆర్ఎస్ఎస్‌కు ఆమోదయోగ్యమా?.. రెండో ప్రశ్నలో కేజ్రీవాల్ మాట్లాడుతూ.. ప్రధాని, అమిత్ షా స్వయంగా అవినీతిపరులని చెప్పిన నేతలను కొద్దిరోజుల తర్వాత బీజేపీలో చేర్చుకున్నారని చెప్పారు. అలాంటి బీజేపీని మీరు లేదా ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ఊహించారా? ఇదంతా చూస్తుంటే బాధగా లేదా? మూడవ ప్రశ్నలో, కేజ్రీవాల్ భగవత్‌ను ఇవన్నీ చేయకుండా ప్రధానమంత్రిని ఎప్పుడైనా ఆపారా అని



అడిగారు. బీజేపీ గందరగోళంలో పడితే దాన్ని సరైన దారిలోకి తీసుకురావడం ఆరెస్సెస్ బాధ్యత అని కేజ్రీవాల్ రాశారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో జేపీ నడ్డా జీ బీజేపీకి ఇకపై ఆర్ఎస్ఎస్ అవసరం లేదని నాలుగో ప్రశ్నలో కేజ్రీవాల్ అన్నారు. నడ్డా జీ ఈ ప్రకటన ప్రతి ఆర్ఎస్ఎస్ కార్యకర్తను బాధించిందని నేను తెలుసుకున్నాను. ఆయన ప్రకటన వల్ల మీ హృదయానికి ఏమైందో దేశం తెలుసుకోవాలనుంది? చివరి ప్రశ్నలో ప్రధాని మోదీ పదవీ విరమణ అంశాన్ని కేజ్రీవాల్ లేవనెత్తారు. 75 ఏళ్లకే పదవీ విరమణ చట్టం చేసి అద్వానీ, మురళీమనోహర్ జోషి వంటి శక్తిమంతమైన నాయకులను పదవీ విరమణ చేశారన్నారు. మోడీకి ఆ చట్టం వర్తించదని అమిత్ షా చెప్పారు. మీరు దీనితో ఏకీభవిస్తారా? చట్టాలు అందరికీ ఒకేలా ఉండకూడదా? ఈ ప్రశ్నలు ప్రతి భారతీయుడి మదిలో మెరుస్తున్నాయని కేజ్రీవాల్ అన్నారు. మీరు ఈ ప్రశ్నలను పరిగణలోకి తీసుకుంటారని.. ఈ ప్రశ్నలకు ప్రజలకు సమాధానం ఇస్తారని నేను హృదయపూర్వకంగా ఆశిస్తున్నాను. అంటూ లేఖలో రాసుకొచ్చారు.

## హర్యానా మెగా ర్యాలీలో కాంగ్రెస్ పై విరుచుకుపడ్డ మోదీ



హర్యానా:హర్యానాలో ఎన్నికల ప్రచారానికి మరికొద్ది రోజులు మాత్రమే మిగిలి ఉంది. దేశంలోని అగ్రనేతలు ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. బుధవారం సోనిపట్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ ప్రభుత్వం హర్యానాకు పెద్ద సహకారం అందిస్తుందన్నారు. కాంగ్రెస్ ఆశ్రిత పక్షపాతాన్ని పెంచుతోందని ఆరోపించారు. ప్రధాని తన ప్రసంగంలో రైతులు, దళితులు, కుటుంబ వాదాన్ని ప్రస్తావించారు. గోహనాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆయన మాట్లాడుతూ.. హర్యానాలో ఓటింగ్ రోజు దగ్గరపడుతున్న కొద్దీ బీజేపీకి మద్దతు పెరుగుతోందని అన్నారు. కాంగ్రెస్ రాజకుటుంబం దేశంలో అత్యంత అవినీతి కుటుంబం. పార్టీ హైకమాండ్ అవినీతికి పాల్పడినప్పుడు, క్రింద దోచుకోవడానికి ఓపెన్ లైసెన్స్ ఉంటుంది. 10 ఏళ్ల క్రితం హర్యానాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు రాష్ట్రాన్ని ఎలా దోచుకున్నారో అందరికీ తెలుసు అన్నారు. ఇక్కడ రైతుల భూములు దోచుకున్నారు, రాష్ట్రాన్ని దళారీలు, అల్లుడులకు అప్పగించారు. కాంగ్రెస్‌కు ఎక్కడ అవకాశం దొరికినా, ఎక్కడ అడుగు పెట్టినా అవినీతి, బంధుప్రీతి తప్పవని మీ అందరికీ తెలుసు. మన దేశంలోని ప్రభుత్వ వ్యవస్థలో అవినీతిని సృష్టించి, పెంచి పోషిస్తున్న పార్టీ కాంగ్రెస్ అని మోదీ ఆరోపించారు. రైతుల ప్రయోజనాల నిమిత్తం హర్యానాలోని బిజెపి ప్రభుత్వం రైతుల నుండి 24 పంటలను ఎంఎస్‌పికి కొనుగోలు చేయాలని నిర్ణయించిం దన్నారు. కానీ ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు, తక్కువ ధరతో పంట లను కొనుగోలు చేయడాన్ని బీజేపీ అసహ్యించుకుందన్నారు. హర్యానాలో గత పదేళ్లుగా బీజేపీ ప్రభుత్వం ఉందని అన్నారు. కానీ మా ప్రభుత్వంపైనా, మన ముఖ్యమంత్రిపైనా ఎలాంటి అవినీతి ఆరోపణలు రాలేదన్నారు. రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వ హయాంలో హర్యానా నేడు వ్యవసాయం, పరిశ్రమల పరంగా దేశంలోని అగ్ర రాష్ట్రాలలో అగ్రస్థానంలో ఉందని ప్రధాని మోదీ అన్నారు. రిజర్వేషన్లపై కాంగ్రెస్‌పై దాడి చేసిన ప్రధాని మోదీ, కాంగ్రెస్ రాజకుటుంబం నుండి దేశానికి ప్రధానమంత్రిగా ఎవరు వచ్చినా రిజర్వేషన్లను ఎప్పుడూ వ్యతిరేకించారని అన్నారు. రిజర్వేషన్ వ్యతిరేకత, రిజర్వేషన్ ద్వేషం ఇవన్నీ కాంగ్రెస్ డీఎన్ఏలోనే ఉన్నాయి. ఎస్సీ/ఎస్టీ/ఓబీసీల భాగస్వామ్యాన్ని కాంగ్రెస్ ఎప్పుడూ దూరం చేసిందన్నారు. దళితులకు రిజర్వేషన్లు కల్పించిన ఏకైక నాయకుడు బాబా సాహెబ్ అంబేడ్కర్ అని, లేకుంటే ఓబీసీ మాదిరిగానే దళితులు కూడా రిజర్వేషన్ కోసం కాంగ్రెస్ ఓటమికి ఎదురుచూడాల్సి వచ్చేదన్నారు.

## హైకోర్టు షాక్.. సిద్ధరామయ్య సీఎం కుర్చీ కదులుతుందా ?



బెంగళూర్ : ముడా (మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) కుంభకోణంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కష్టాలు పెరుగుతున్నాయి. గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ నిర్ణయాన్ని సవాలు చేస్తూ ఆయన వేసిన పిటిషన్‌ను కర్ణాటక హైకోర్టు తిరస్కరించింది. కోర్టు తీర్పు అనంతరం సిద్ధరామయ్య మాట్లాడుతూ.. ఎలాంటి విచారణకైనా వెనుకాడబోమని, న్యాయ నిపుణులతో చర్చిస్తామన్నారు. నా రిట్ పిటిషన్‌పై హైకోర్టు తీర్పునిచ్చిందన్నారు. ప్రాసిక్యూషన్‌ను గవర్నర్ ఆమోదించారు. నేను హైకోర్టులో దానిపై ప్రశ్నలు లేవనెత్తానని తెలిపారు. ఈ కష్టకాలంలో కాంగ్రెస్ సీనియర్ మంత్రులు, నేతలు సిద్ధరామయ్యకు అండగా నిలుస్తున్నారు. ముఖ్యమంత్రి తప్పేమీ లేదని, విచారణ తర్వాత కూడా ఆయన క్లీన్‌గా ఉంటారని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. పిటిషన్ తిరస్కరణకు గురవ్వడంతో సీఎం, డిప్యూటీ సీఎం శివకుమార్, కాంగ్రెస్ ఎమ్మెల్యేలంతా సీఎం అధికారిక నివాసానికి సమావేశమై తదుపరి చర్యలపై చర్చించారు. ఇప్పుడు సీఎంకు న్యాయపరమైన అవకాశాలు ఏమిటన్న ప్రశ్న తలెత్తుతోంది.

సీఎంకు ఉన్న ఆప్షన్లు ఏమిటి?

ఉన్నత న్యాయస్థానంలో అప్పీలు చేసుకునే అవకాశం కూడా ఉంది. ముఖ్యమంత్రి దోషి అని ఏమీ చెప్పలేదు లేదా అలా సూచించే నివేదికలు లేవు. అవకతవకలు జరిగితే విచారణ జరిపించాలని కోర్టు తీర్పునిచ్చింది. అదే సమయంలో ముఖ్యమంత్రికి రెండు న్యాయపరమైన అవకాశాలు మిగిలి ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. కర్నాటక హైకోర్టులో ఇంట్రా-కోర్టు అప్పీల్ దాఖలు చేసి, డివిజన్ బెంచ్ ద్వారా కేసును విచారించడం మొదటి ఎంపిక. సుప్రీం కోర్టులో MUDAస్పెషల్ లీవ్ పిటిషన్) దాఖలు చేయడం రెండవ ఎంపిక. కర్ణాటక హైకోర్టు నిర్ణయం ప్రకారం.. దర్యాప్తును అనుమతించాలన్న గవర్నర్ నిర్ణయం స్వతంత్రమైనది.. ఇది అతని అధికారంలో ఉంది. దీంతో సిద్ధరామయ్యపై విచారణ ప్రారంభించేందుకు మార్గం సుగమమైంది.

సీఎంపై వచ్చిన ఆరోపణలేంటి?

ముడా భూకేటాయింపు కేసులో ఆరోపణ ఏమిటంటే, సిద్ధరామయ్య భార్య బీఎం పార్వతికి మైసూర్‌లోని ఒక పాష్ ఏరియాలో పరిహారంగా కేటాయించిన ప్లాట్లు సేకరించిన భూమి కంటే చాలా ఎక్కువ ధర పలికాయి. పార్వతి రెసిడెన్షియల్ లేఅవుట్‌లను అభివృద్ధి చేసిన 3.16 ఎకరాల భూమికి బదులుగా 50:50 నిష్పత్తిలో ముడా ఆమెకు ప్లాట్లు కేటాయించింది. ఈ వివాదాస్పద పథకం కింద, నివాస లేఅవుట్‌లను అభివృద్ధి చేయడానికి అభివృద్ధి చెందని భూమిని తీసుకున్న వ్యక్తులకు %వీఖణూ% 50 శాతం అభివృద్ధి చెందిన భూమిని కేటాయించింది. మైసూరు తాలూకాలోని కసబా హోబ్లీలోని కసరే గ్రామంలోని సర్వే నంబర్ 464లో ఉన్న 3.16 ఎకరాల భూమిపై పార్వతికి చట్టపరమైన హక్కు లేదని ఆరోపించారు.

రాజీనామా చేయాలని బీజేపీ డిమాండ్

హైకోర్టు తీర్పు తర్వాత సిద్ధరామయ్యపై బీజేపీ విరుచుకుపడుతోంది. ఆయన రాజీనామా చేయాలని పార్టీ డిమాండ్ చేస్తోంది. గవర్నర్ చర్యను హైకోర్టు సమర్థించిందని కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ అన్నారు. సిగ్గుమాలిన అవినీతి ఆరోపణలపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రాజీనామా చేసి స్వతంత్ర, నిష్పక్షపాత దర్యాప్తునకు మార్గం సుగమం చేయాలని బీజేపీ డిమాండ్ చేస్తోంది. రాష్ట్ర బీజేపీ నేతలు కూడా ఇదే డిమాండ్ చేశారు. బీజేపీ కర్నాటక విభాగం కూడా ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా ఆందోళనకు దిగింది.

## నా జీవిత లక్ష్యం అదే.. మల్లు రవితో భేటీ అనంతరం ఆర్ కృష్ణయ్య కీలక వ్యాఖ్య

హైదరాబాద్: నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ మల్లు రవితో భేటీ అనంతరం బీసీ ఉద్యమ నేత ఆర్ కృష్ణయ్య కీలక వ్యాఖ్యలు చేశారు. చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్ల కోసం పోరాటం చేసి సాధించడం నా జీవిత లక్ష్యం అని కృష్ణయ్య స్పష్టం చేశారు. రాజ్యాధికారం కోసం పోరాటం చేయడం ప్రతి ఒక్క బీసీ బిడ్డ కోరుతున్నానని ఆయన ప్రకటించారు. హైదరాబాద్ విద్యానగర్‌లోని ఆర్ కృష్ణయ్య నివాసానికి ఈ ఉదయం ఎంపీ మల్లు రవి వెళ్లారు. ఆర్ కృష్ణయ్యతో దాదాపు అర గంటకు పైగా మల్లు రవి చర్చలు జరిపారు. కాంగ్రెస్ పార్టీలోకి రావాలని కృష్ణయ్యను మల్లు రవి ఆహ్వానించినట్లు సమాచారం. ఈ సమావేశం అనంతరం ఆర్ కృష్ణయ్య మీడియాతో మాట్లాడా రు. రాష్ట్రంలో బీసీ ఉద్యమాన్ని రాజకీయాలకు అతీతంగా చేయబోతున్నాం. బీసీ ఉద్యమం బలం కోసం రాజ్యసభ పదవీకి రాజీనామా చేశాను. ఈ ఉద్యమం ద్వారా దేశ బీసీలకు న్యాయం జరిగేలా పోరాడతాను. వివిధ పద్ధ తుల్లో ఉద్యమాలు చేస్తాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ వర్గాలకు న్యాయం చేయడం లేదు. స్వాతంత్ర్యం వచ్చి 76 ఏండ్లు గడుస్తున్నప్పటికీ బీసీలకు న్యాయం జరగడం లేదని బీసీ బిడ్డలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని ఆర్ కృష్ణయ్య తెలిపారు. వైసీపీ అధినేత జగన్ నన్ను రాజ్యసభకు పంపించారు. బీసీల తరుపున చట్ట సభల్లో ప్రశ్నించిన సమాధానం రాలేదు. ఇంకా తన పదవీకాలం నాలుగేండ్లు ఉంది. కానీ బీసీ ఉద్యమం కోసం రాజీనామా చేశాను. రాజ్యాధికారంలో వాటా.. చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి. అసెంబ్లీ ఎన్నికల్లో 21 సీట్లు బీసీలకు ఇచ్చారు. స్థానిక సంస్థల్లోనూ బీసీలకు



రిజర్వేషన్లు పెంచాలి. బీసీల కోసం చాలా త్యాగాలు చేయాలి. గ్రామ,మండల,జిల్లా కమిటీలు వేయాలని బీసీలను కోరుతున్నాన ఆర్ కృష్ణయ్య.

### ఎంబిబిఎస్, బిడిఎస్ ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం

హైదరాబాద్: తెలంగాణ లో ఎంబిబిఎస్, బిడిఎస్ ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. ఇక , కన్వీనర్ కోటా కింద దరఖాస్తు చేసుకున్న 16,679 మంది విద్యార్థులకు సంబంధించిన మెరిట్ లిస్ట్ ను నిన్న కాళోజీ హెల్త్ యూనివర్సిటీ విడుదల చేసింది. ఈ లిస్ట్ పై ఏమైనా అభ్యంతరాలుంటే ఇవాళ సాయంత్రం లోపు వెబ్ సైట్ ద్వారా తెలియజేయాలని యూనివర్సిటీ వీసీ బి.కరుణాకర్ రెడ్డి తెలిపారు. ఫైనల్ మెరిట్ లిస్ట్ రేపు విడుదల చేసి, అదే రోజు వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ ప్రారంభించనున్నట్టు తెలిపారు

## సంపాదకీయం

గురువారం 26-09-2024

# ప్రత్యామ్నాయానికి ఓటు

శ్రీలంక అధ్యక్ష ఎన్నికల్లో వామపక్ష నేత అనుర కుమార దిసనాయకె అనూహ్య విజయం హర్షణీయం. దిసనాయకె ఘన విజయం ప్రపంచ వ్యాప్తంగా వామపక్ష, అభ్యుదయ కాముకులకు ఆనందం కలిగిస్తుంది. శ్రీలంక తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నాక జరిగిన ఎన్నికలు కావడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. జనతా విముక్తి పెరమున (జెవిపి) నేతృత్వంలోని నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పిపి) కూటమి అభ్యర్థిగా దిసనాయకె ఎన్నికల్లో పోటీ చేశారు. కూటమిలో 27 వామపక్ష పార్టీలు, సంస్థలు, ప్రజాసంఘాలు కలిసి ఉన్నాయి. శనివారం నిర్వహించిన ఎన్నికల్లో 70 శాతానికిపైన ఓట్లు పోలయ్యాయి. ఓట్ల లెక్కింపులో తొలిరౌండ్‌లో ఎన్‌పిపి అభ్యర్థి దిసనాయకె 42.3 శాతం ఓట్లు తెచ్చుకొని మొదటి స్థానంలో నిలవగా, ప్రతిపక్ష నేత, ఎస్‌ఎల్‌పి అభ్యర్థి సాజిత్ ప్రేమదాస 32.76 శాతం ఓట్లు తెచ్చుకొని రెండవ స్థానంలో, ప్రస్తుత అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘె 17.27 శాతం ఓట్లతో మూడవ స్థానంలో నిలిచారు. తొలిరౌండ్‌లో 50 శాతానికి పైన ఓట్లు వచ్చిన వారు విజేత అవుతారు. ఎవ్వరికీ ఆ ఓట్లు రాకపోవడంతో రెండవ ప్రాధాన్యతా ఓట్ల లెక్కింపు చేపట్టాక దిసనాయకె అత్యధికంగా 55.89 శాతం ఓట్లు తెచ్చుకొని తిరుగులేని ఆధిక్యతలో నిలిచారు. 1982లో శ్రీలంక కొత్త రాజ్యాంగం వచ్చాక తొలిసారి రెండవ ప్రాధాన్యతా ఓట్లతో అధ్యక్షునిగా గెలుపొందింది దిసనాయకెనే. తొలిసారి 2019 ఎన్నికల్లో ఎన్‌పిపి అభ్యర్థిగా పోటీ చేసిన దిసనాయకె 3.16 శాతం ఓట్లు మాత్రమే తెచ్చుకున్నారు. అలాంటిది ఇప్పుడు అధికారంలోకి రావడం చిన్న విషయమేమీ కాదు. గడచిన ఎనిమిది దశాబ్దాలుగా వివిధ పార్టీలను చూసిన ప్రజలు వాటి మీద విశ్వాసం కోల్పోయి ఈ తడవ వామపక్ష అభ్యర్థికి ఓట్లు వేశారు. గత ప్రభుత్వాల నిర్వాకం వలన దేశంలో తీవ్ర ఆర్థిక సంక్షోభం తలెత్తింది. నిరసనగా ప్రజలు, యువత రోడ్లపైకొచ్చి ఆందోళనలు చేశారు. ఈ నేపథ్యంలో ప్రజలు ప్రత్యామ్నాయం కేసి ఆలోచించి వామపక్ష అభ్యర్థికి ఓట్లు వేశారని అర్థమవుతుంది. గతంలో తుపాకీ చేపట్టి విప్లవాన్ని తీసుకొచ్చేందుకు రెండుసార్లు జెవిపి విఫలయత్నం చేసింది. ఇప్పుడు బ్యాలెట్ ద్వారా అధికారం పొందింది. ఈ విజయం దాని చరిత్రలో ఒక ముఖ్య మూలమలుపు. మార్పుకోసం ప్రజలిచ్చిన విజయంగా దిసనాయకె వాస్తవాన్ని చెప్పారు. చెల్లింపుల సంక్షోభం, అధిక ధరలు, నిరుద్యోగం, ఐఎంఎఫ్ అప్పుల నుండి శ్రీలంకను బయట పడేయడం దిసనాయకె ముందున్న తక్షణ సవాల్. అదానీ ఎనర్జీ ప్రాజెక్టు రద్దు, గత ప్రభుత్వం ఐఎంఎఫ్‌తో కుదుర్చుకున్న 290 కోట్ల డాలర్ల చెల్లింపు ఒప్పందం సమీక్ష వంటి ఎన్నో హామీలను ప్రజలకు ఇచ్చారు. వీటిని అమలు చేయాల్సి ఉంది. నరేంద్ర మోడీ, ఆయన కార్యాలయం ప్రత్యక్ష జోక్యంతో శ్రీలంక ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి మరీ అదానీకి పవర్ ప్రాజెక్టు ఇప్పించారని అప్పట్లో ఆరోపణలొచ్చాయి. దిసనాయకె గెలుపు మన దేశంలో బిజెపికి, మోడీకి ఇబ్బందికరం అన్నది విశ్లేషకుల అంచనా. కమ్యూనిస్టులు, వామపక్ష శక్తుల పని అయిపోయింది, వారు కోలుకొని అధికారంలోకి వచ్చే అవకాశం లేదంటూ నిరాశలో ఉన్న వారికి శ్రీలంకలో వామపక్ష అభ్యర్థి ఎన్నిక ఉత్సాహాన్ని ఇస్తుంది. కమ్యూనిస్టుల అవసరం లేదని నిర్వచించే పెట్టుబడిదారీ మేధావులకు శ్రీలంక అధ్యక్ష ఎన్నికల ఫలితాలు ముచ్చెమటలు పోయిస్తాయి. లాటిన్ అమెరికాలో వామపక్షాల విజయాలు, దక్షిణాఫ్రికా అధికార కూటమిలో కమ్యూనిస్టులు, నేపాల్‌లో తిరుగులేని శక్తిగా వామపక్షాలు ఉన్నాయి. ఇప్పుడు శ్రీలంక వంతు వచ్చింది. అధ్యక్ష ఎన్నికలతో పాటు పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఎన్‌పిపి కూటమి అత్యదిక సీట్లలో గెలిస్తేనే పూర్తి స్థాయిలో ఇబ్బందులు తొలగుతాయి. ఎన్నికల హామీలను, శ్రీలంక ఎదుర్కొంటున్న సమస్యలను దిసనాయకె సమర్థవంతంగా ఎదుర్కొంటారని, ప్రజల సంక్షేమం కోసం పని చేస్తారని ఆశిద్దాం.

# బంగ్లాదేశ్ నుంచి వలసలు తప్పవా?



మొత్తం ఈశాన్య ప్రాంతం, ముఖ్యంగా అసోం, మేఘాలయ, త్రిపుర, మిజోరమ్ పొరుగునున్న ఉత్తర బెంగాల్‌లోని చికెన్ నెక్ కారిడార్ ద్వారా భారత భూభాగంతో కన్నా ఎక్కువ సరిహద్దులు పంచుకుంటున్నాయి. ఏ రాజకీయ పార్టీకీ అనుబంధితం కాని విద్యార్థుల సారథ్యంలో సాగిన ఉధృత ఉద్యమం ఫలితంగా బంగ్లాదేశ్ మాజీ ప్రధాని దేశం వదలి పారిపోయిన తరువాత ఇటీవల చోటు చేసుకున్న సాంఘిక, రాజకీయ పరిణామాలను ఈశాన్య ప్రాంత ప్రజలు ఆసక్తితో గమనిస్తున్నారు. 1971లో బంగ్లాదేశ్ స్వాతంత్ర్య పోరా టం తరువాత మాదిరిగా ఆ రాష్ట్రాల్లోకి శరణార్థుల వలస పెద్ద ఎత్తున జరగవచ్చుననే ఆందోళన కూడా ఉన్నది. షేక్ హసీనాకు వ్యతిరేకంగా విజయవంతంగా ఉద్యమానికి నాయకత్వం వహించిన విద్యార్థులు ఈ ఉద్యమాన్ని బంగ్లాదేశ్ రెండవ స్వాతంత్ర్య పోరాటంగా అభివర్ణించారు. హసీనా ప్రభుత్వం పతనం తరువాత ఈ పర్యాయం కూడా భారత్‌లో ప్రవేశానికి అనేక మంది ప్రజలు, ముఖ్యంగా హిందువులు సరిహద్దు దాటేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే, గట్టి సరిహద్దు భద్రత ఏర్పాట్లు బంగ్లాదేశ్ నుంచి అటువంటి వలసను అడ్డుకున్నాయి. ప్రభుత్వ ఉద్యోగాల కోటాలకు వ్యతిరేకంగా విద్యార్థులు నెల రోజుల పాటు నిరసన ప్రదర్శనలు సాగించడంతో ప్రధాని షేక్ హసీనా రాజీనామా చేశారు. 1971 స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న ప్రజల వారసులకు 30% సివిల్ సర్వీస్ ఉద్యోగాలను ఆమె ప్రభుత్వం రిజర్వ్ చేసింది. ప్రభుత్వ అణచివేత చర్యలు, అధికార అవామీ లీగ్ పార్టీ తో సంబంధం ఉన్న వర్గాల దాడుల పర్యవసానంగా నిరసనలు హింసాత్మకంగా మారాయి. ఆగస్టు 4, 5 తేదీల్లో ప్రజ్వరిల్లిన హింసాత్మక సంఘటనలు షేక్ హసీనా ప్రభుత్వ 15 ఏళ్ల పాలనకు ముగింపు పలికాయి. నాయకుడు లేని కళాశాల విద్యార్థుల ఉద్యమం షేక్ హసీనాకు, అధికారంలో ఉన్న ఆమె పార్టీకి సవాల్ విసిరింది. ముందుగా ప్రకటించిన తేదీలు, వేదికలతో వారు ర్యాలీ లు, పాదయాత్రలు నిర్వహించారు. స్వల్ప కాలంలోనే ఆ యువ విప్లవకారులు వీధుల్లో ప్రవేశించడంతో దేశం దృష్టిని ఆకర్షించారు. దానితో హసీనా పారిపోవడానికి హెలికాప్టర్ ఎక్కవలసి వచ్చింది. ఒక దశాబ్దంపైగా మాజీ ప్రధాని నేతృత్వంలోని రాజకీయ ప్రతిపక్షం ప్రయత్నించి, వరుసగా విఫలమైన పరిణామాన్ని వారు సాధించారు. భవిష్యత్ సంస్కరణలపై ఏవో కొన్ని వాగ్దానాలతో సరిపోయే పరిస్థితిని ప్రధాని చేసిన అర్థం లేని వ్యాఖ్యలు, ఆమె భద్రత బలగాల క్రూర అణచివేత చర్యలు మరింత ప్రజ్వలింప చేశాయి. హింసాత్మక సంఘటనలు సాగిస్తున్నవారు విద్యార్థులు కారని, దేశాన్ని అస్థిరపరిచేందుకు ప్రయత్నిస్తున్న ఉగ్రవాదులని ఆమె అన్నారు. నిరసనకారులను అవామీ లీగ్ ప్రభుత్వం రజాకార్లుగా పేర్కొన్నది. పాకిస్తానీ దళాలకు సహకరించేవారిని అభివర్ణించేందుకు హసీనా ప్రభుత్వం రజాకార్ పదాన్ని వాడుతుండేది. హింసాకాండ, లూటీలు, గృహదహనాలు, ప్రభుత్వ ఆస్తుల విధ్వంసాలపై ముఖ్యంగా ఇస్లామిక్ రాడికల్ శక్తులు, పాకిస్తాన్, చైనా కారణంగా భారతీయ మీడియాలో ఒక వర్గం దృష్టి కేంద్రీకరించినప్పటికీ షేక్ హసీనా దేశం వదలి పారిపోయిన తరువాత రోడ్లపై భారీ సంఖ్య లో జనం సమీకృతం కావడం, వారి ఆనందాతిరేకాలు ప్రభుత్వంపై ప్రజలు అప్పటికప్పుడు వ్యక్తం చేసిన ఆగ్రహావేశాలను సూచిస్తున్నాయి. పరిస్థితులు తనకు వ్యతిరేకంగా మారుతున్న విషయాన్ని హసీనా ప్రభుత్వం పసిగట్టలేకపోయింది. దేశంలో అంతర్గత వివాదాలు, సాంఘిక సమస్యల పరిష్కారంలో హసీనా ప్రభుత్వం దుందుడుకుతనం, మొండిపట్టుదల దేశంలో హింసాకాండ ప్రజ్వలనకు, పరిస్థితి విషమించడానికి కారణం అయ్యాయి. హసీనా ప్రభుత్వ పతనమైన వెంటనే కొన్ని ఇస్లామిక్ మూఢశక్తులు మైనారిటీలపై, ముఖ్యంగా హిందువులపై బెదిరింపులు, దాడులు సాగించినట్లు వార్తలు వచ్చాయి. అయితే, విద్యార్థి నాయకులు, స్థానిక ప్రజలు మైనారిటీల సంరక్షణకు ముందుకు వచ్చారు. మనం భారత్‌ను పరికిస్తే ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం కింద ప్రతి రోజు దేశవ్యాప్తంగా మైనారిటీలపై అటువంటి దాడులు జరుగుతుండడం కనిపిస్తుంది. హసీనాను హిందువుల రక్షకురాలుగా, భారత్ అనుకూల నేతగా, ఆమెకు ముందు ప్రధాని పదవి లో ఉన్ననేతను మైనారిటీ వ్యతిరేకిగా, భారత్ అనుకూలవతిగా కాకుండా, భారత వ్యతిరేకిగా, భారతీయ నేతలు పరిగణించడం దౌత్యపరంగా విజ్ఞతతో కూడిన చర్య కాదు. ఎందుకంటే బంగ్లాదేశ్ భౌగోళిక, రాజకీయ రక్షణ, భద్రత దృష్ట్యా ఆ దేశంతో భారత్‌కు స్నేహపూర్వక సంబంధాలు కీలకం. బంగ్లాదేశ్ కేవలం ఏదో పొరుగు దేశం కాదు. అది భారత్‌కు వ్యూహాత్మక భాగస్వామి, సరిహద్దు భద్రతకు, ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాలతో సరిహద్దు భద్రతకు కీలకమైన సన్నిహిత మిత్రదేశం. రెండు దేశాల మధ్య 4096 కిలోమీటర్ల నిడివైన సరంధ్రమైన సరిహద్దు ఉన్నది. భారత ఈశాన్య ప్రాంత రాష్ట్రాల నుంచి సాయుధ తిరుగుబాటు వర్గాలు సురక్షిత ప్రదేశం కోసం బంగ్లాదేశ్‌లోకి ప్రవేశించడానికి అది తేలికగా వీలు కల్పిస్తుంది. నోబెల్ గ్రహీత, బంగ్లాదేశ్‌లో ప్రస్తుత మధ్యంతర ప్రభుత్వ ముఖ్య సలహాదారు ప్రొఫెసర్ మొహమ్మద్ యూనస్ మౌలికవాది కారు. ఆయన తమ దేశంలో ఇస్లామిక్ రాడికల్స్ ఆధిపత్యాన్ని అనుమతించబోరని ఆశించాలి. బంగ్లాదేశ్‌కు వచ్చి, హసీనా ప్రభుత్వ పతనానంతరం హిందువులు ఎలా బంగ్లాదేశ్‌లో జీవిస్తున్నారో నివేదించవలసిందని భారతీయ జర్నలిస్టులను ప్రొఫెసర్ యూనస్ ఆహ్వానించారు. షేక్ హసీనా హయాంలో నేను చాలా సార్లు బంగ్లాదేశ్‌ను సందర్శించి, ఎదురుగా కనిపిస్తున్న కొన్ని అభివృద్ధి ప్రాజెక్టులు, వెడల్పైన రోడ్లు, పద్మా నదిపై వంతెన నిర్మాణం మొదలైనవి స్వయంగా గమనించాను. అయితే, గడచిన రెండు, మూడు సంవత్సరాల్లో ప్రభుత్వంలోని ప్రతి విభాగంలో పెచ్చుమీరిన అవినీతి పనులకు స్థానిక జర్నలిస్టులతో సహా సాధారణ ప్రజలు హసీనా ప్రభుత్వాన్ని బాహాటంగా విమర్శించసాగారు. ఇక్కడ విడ్డూరమేమంటే అవినీతి కేసుల్లో దోషిగా నిర్ధారణ జరిగినందుకు ప్రధాన ప్రతిపక్షం బిఎన్‌పి నేత ఖాలెడ్ జియాను హసీనా ప్రభుత్వం జైలుపాలు చేయడమే కాకుండా ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించడం. ఈ రచయిత అధ్యక్షుడుగా ఉన్న, 2019లో రెండు దేశాల జర్నలిస్టులతో ఏర్పాటైన ఇండో బంగ్లాదేశ్ జర్నలిస్ట్ ఫోరమ్ సరిహద్దుకు రెండు వైపుల పలు సమావేశాలు నిర్వహించింది. ద్వైపాక్షిక సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక అంశాలపై దృష్టి కేంద్రీకరిస్తూ అభిప్రాయాల మార్పిడికి, రాజకీయ విమర్శలకు మించి సమస్యలపై మెరుగైన అవగాహన కోసం ప్రజల మధ్య ముఖాముఖికి వీలు కల్పించడం వాటి లక్ష్యం. భారత్‌లోకి బంగ్లాదేశీ జాతీయుల అక్రమ చొరబాటు, నదీజలాల పంపకం, భారత సరిహద్దు భద్రత బలగాలు బంగ్లాదేశీ పౌరులను హతమార్చడం, భారత్‌తో బంగ్లాదేశ్ వాణిజ్య లోటు వంటి వివాదాస్పద అంశాలను వాస్తవిక దృక్పథంతో రెండు దేశాల జర్నలిస్టు చర్చించారు. రెండు వైపుల ఎవరు అధికారంలో ఉన్నా పరస్పర మైత్రీబంధం విఘాతాన్ని బంగ్లాదేశ్, భారత్ భరించజాలవని రెండు దేశాల జర్నలిస్టులు అభిప్రాయం వ్యక్తం చేశారు. 1996 ఎన్నికల్లో తమ అవామీ లీగ్ పార్టీ గెలిచిన తరువాత షేక్ హసీనా మొదటి సారిగా బంగ్లాదేశ్ ప్రధాని అయ్యారు. అధికారంలో ఆమె రెండవ విడత 2009లో మొదలైంది. ఆమె రెండవసారి 2009లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బంగ్లాదేశ్ భారీ స్థాయిలో ఆర్థిక పురోగతి సాధించిందనడం నిజమే. అయితే, 2018 సార్వత్రిక ఎన్నికల తరువాత దేశం ఆర్థిక మాంద్యానికి గురైంది. కరోనా మహమ్మారి కూడా దేశం ఆర్థిక సంక్షోభాన్ని తీవ్రం చేసింది. కొన్ని కీలక రంగాల్లో పురోగతి సాధించినప్పటికీ దేశంలో ప్రజాస్వామ్యం లోటు ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనల కారణంగా బంగ్లాదేశ్ ప్రధాన పారామిలిటరీ దళం రాపిడ్ ఏక్షన్ బెటాలియన్ (ఆర్ఎబి)పైన, దాని ప్రస్తుత, పూర్వపు అధికారులపైన 2021లో యుఎస్ ఆర్థిక శాఖ ఆంక్షలు విధించింది. 2023లో ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హులు కావడానికి ప్రతిపక్ష సభ్యులను దోషులుగా నిర్ధారించేందుకు జాతీయ ఎన్నికలకు ముందు బంగ్లాదేశ్ అధికారులు అణచివేత చర్యలను కఠినతరం చేశారని ప్రతిపక్షం ఆరోపించింది. బంగ్లాదేశ్ మధ్యంతర ప్రభుత్వాన్ని సంతుష్టి పరచేందుకు భారత ప్రభుత్వం సకారాత్మక దృక్పథాన్ని కనబరచింది. ప్రధాని నరేంద్ర మోడీ బంగ్లాదేశ్ మధ్యంతర అధినేత మొహమ్మద్ యూనస్‌తో టెలిఫోన్‌లో మాట్లాడారు. అయినప్పటికీ గడచిన 15 సంవత్సరాలుగా షేక్ హసీనాకు, ఆమె పార్టీకి మద్దతు కొనసాగించినందుకు బంగ్లాదేశ్‌లో వ్యక్తం అవుతున్న ఆగ్రహాన్ని చల్లార్చేందుకు భారత్ కొంత వ్యవధి తీసుకున్నది. భారత్ ఆధిపత్య యత్నాన్ని ప్రతిఘటించడంలో మాల్దీవులు, నేపాల్ సరసన బంగ్లాదేశ్ చేరడంతో భారత 'పొరుగుదేశం ముందు' విధానానికి మరొక ఎదురుదెబ్బ తగిలింది. బంగ్లాదేశ్‌లో కొత్త ప్రభుత్వాన్ని ఆకట్టుకోవడానికి భారత్ ఇప్పుడు చాలా జాగ్రత్తగా, దౌత్యపరమైన నైపుణ్యంతో వ్యవహరించవలసి ఉంటుంది. ఈ ప్రాంతంలో పెరుగుతున్న చైనా పలుకుబడిని భారత్ అలక్ష్యం చేయరాదు. బంగ్లాదేశ్ కొత్త ప్రభుత్వంతో భారత్ సంబంధానికి తిరిగి రూపకల్పన చేయడానికి భారత 'పొరుగు దేశం ముందు' విధానంలో ప్రాథామ్యం కావాలి.

# లడ్డూ అంశంపై పవన్, ప్రకాష్ డైలాగ్ వార్!



వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసిన అంశం మీద కేవలం తెలుగు రాష్ట్రాల్లోని వారు మాత్రమే కాకుండా, ప్రపంచ వ్యాప్తంగా సనాతన ధర్మాన్ని అనుసరించేవారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తీవ్ర మనోవేదన చెంది ప్రాయశ్చిత్త దీక్ష కూడా జరిగింది. ఈ నేపథ్యంలో ఈ అంశం మీద ప్రకాష్ రాజ్ ట్విట్టర్ ద్వారా స్పందించారు. పవన్ కళ్యాణ్ ని ట్యాగ్ చేస్తూ, 'మీరు డిప్యూటీ సీఎంగా వున్న రాష్ట్రంలో ఈ ఘటన జరిగింది. విచారణ చేపట్టి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోండి. భక్తులకు అనవసర భయాలు కల్పించి... దీనిని జాతీయ స్థాయిలో ఎందుకు చర్చించుకునేలా చేస్తున్నారు? మన దేశంలో ఇప్పటికే వున్న మతపరమైన ఉద్రిక్తతలు చాలు' అని అన్నారు. దీనికి పవన్ కళ్యాణ్ చాలా సీరియస్‌గా రియాక్ట్ అయ్యారు. విజయవాడ కనకదుర్గ దేవాలయంలో మీడియాతో మాట్లాడిన పవన్ కళ్యాణ్, సున్నితమైన అంశాల మీద ప్రకాష్‌రాజ్ తెలుసుకుని మాట్లాడాలని అన్నారు. ప్రకాష్‌రాజ్‌తో పాటు అందరికీ చెబుతున్నానని, విమర్శలు చేసే ముందు ఏం జరిగిందో తెలుసుకోవాలని సూచించారు. సనాతన ధర్మంపై ఇష్టమొచ్చినట్లుగా మాట్లాడితే ఊరుకునేది లేదని పవన్ పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై ప్రకాష్‌రాజ్ ఒక వీడియో సందేశం ద్వారా స్పందించారు. తాను చెప్పిన పవన్ కళ్యాణ్ అపార్థం చేసుకున్నారని అందులో పేర్కొన్నారు. ప్రస్తుతం తాను విదేశాల్లో సినిమా షూటింగ్‌లో ఉన్నానని, ఈ నెల 30 తర్వాత వచ్చి పవన్ కళ్యాణ్ ప్రతి ప్రశ్నకు సమాధానం ఇస్తానని అన్నారు. పవన్ కళ్యాణ్ వీడియో సందేశానికి జనసేన అఫీషియల్ ట్విట్టర్ అకౌంట్లో స్పందన వచ్చింది. డియర్ ప్రకాష్‌రాజ్ గారూ... 1. మీ ట్వీట్‌ను మేము సరిగానే అర్థం చేసుకున్నాం, డిప్యూటీ సీఎంగా ఉన్నారు కాబట్టే ఈ అంశం మీద ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారి ప్రతిపాదనపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే 'సిట్' ఏర్పాటు చేయడం జరిగింది. 2. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందువుల మనోభావాలను, తిరుమల పవిత్రతను దెబ్బతీసే విధమైన చర్య జరిగినప్పుడు ఇది ప్రతీ ఒక్కరూ ముక్త కంఠంతో ఖండించాలి. కోట్లాది హిందువులతో జంతు కొవ్వు, పంది కొవ్వు, చేప నూనెతో తయారు చేసిన లడ్డూ తినేలా చేసినప్పుడు, ప్రతీ ఒక్కరూ ఖండించాల్సిందే. 3. ఎక్కడైనా ఇతర మతాల వారిమీద ఘటనలు జరిగితే దేశంలో సెక్యులరిజం లేదు అని గగ్గోలు పెట్టే మీరు, 100 కోట్లకు పైగా హిందువుల విశ్వాసాలు దెబ్బతీసిన ఘటనపై దేశం స్పందించకుండా ఉంటే ఎలా? 4. దేశంలో ఎన్నో గొడవలు ఉన్నాయని అంటున్నారు, వాటిలో మీకు ఒక వర్గానిదే తప్పు అన్నట్లుగా కనిపిస్తుంది, కారణాలు మీ రాజకీయ విధానాలు కావచ్చు, మాకు అనవసరం. ఇది హిందువుల మత విశ్వాసాలకు సంబంధించిన విషయం. మీకు పవన్ కళ్యాణ్ గారు చెప్పిన విషయం అర్థం అవుతుంది అని అనుకుంటున్నాను. 5. సమస్య ఎవరిదైనా సరే గొంతెత్తి రాజకీయాలకు అతీతంగా మాట్లాడిన వ్యక్తి గౌరవనీయమైన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారు, ఈ విషయం వ్యక్తిగతంగా మీకు తెలుసు అని అనుకుంటున్నాము.

# సీమ ప్రజల కష్టాల కన్నీళ్లు

కడప,సీమ ప్రజల కష్టాల కన్నీళ్లు ఈనాటివి కావు. పాలకవర్గాల దగా చరిత్రా ఇప్పటిది కాదు. నాటి పెద్ద మనుషుల ఒప్పందంలోని అంశాల అమలుతో మొదలుపెడితే, నిన్న మొన్నటి రాష్ట్ర విభజన ప్రహసనం వరకు సీమ జిల్లాలకు పాలకులు రిక్తహస్తాలనే చూపించారు. హైకోర్టు బెంచ్ ఏర్పాటు ప్రకటన కొంత ఊరటనిచ్చేదే అయినా..సాగునీటి రంగాన్ని అభివృద్ధి చేయాల్సి ఉంది. అదే సీమ వెనకబాటును పారదోలుతుందని ఇక్కడి వారు అంటున్నారు. పలువురు నేతలు ఈ ప్రాంతం నుండి ప్రాతినిధ్యం వహించినా, ముఖ్య మంత్రులను, కేంద్ర మంత్రులను అందించినా సీమ ముఖచిత్రం మారడంలేదు. రాష్ట్ర విభజన తరువాతైనా తమ కష్టాలు తీరుతాయని, నిధుల కేటాయింపులో ప్రాధాన్యత లభిస్తుందని భావించిన ప్రజానీకానికి తీవ్ర నిరాశనే మిగిల్చింది. గత ఐదేళ్ల జగన్ పాలనలోనూ ఎలాంటి పురోగతి కనిపించలేదు. రాయలసీమలో వెనకబాటు నిర్మూలనకు గత ఐదేళ్లలో తీసుకున్న చర్యలు శూన్యం. పాలకుల వైఖరి కారణంగా నిరసన గళాలు వినిపిస్తున్నాయి. విభజన తరవాత కూడా సీమకు న్యాయం జరగడం లేదన్న ఆందోళన ప్రజల్లో కనిపిస్తోంది. రాష్ట్ర జనాభాలో 30 శాతం, విస్తీర్ణంలో 40 శాతం ఉన్న సీమపై నిరసనలు పెరుగుతున్నాయి. ప్రధానంగా సాగునీటి, పారిశ్రామిక రంగం పురోగమించక పోవడం వల్ల నిరుద్యోగ యువతలో ఆందోళన పెరుగుతోంది. చంద్రబాబు, జగన్ సిఎంలుగా ఉన్నా సీమకు పెద్దగా ఒరిగిందేమీ లేదు. అయితే గతంతో పోలిస్తే ఇప్పుడు సీమకోసం కొంత ప్రత్యేక శ్రద్ధ కనిపిస్తోంది. సిఎం చంద్రబాబు సీమలో పరిశ్రమల కోసం కృషి చేస్తున్నారు. గత ఐదేళ్ల కాలంలో జగన్ హయాంలో కడప ఉక్కు ఫ్యాక్టరీకి దిక్కు లేకుండా పోయింది. ప్రాజెక్టులు ఇంకా పూర్తి కాలేదు. నీటి వనరులకు మోక్షం దక్కడం లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనంతను తాను దత్తత తీసుకున్నానని ప్రకటించిన సిఎం చంద్రబాబు, విభజన తరవాత కూడా అనంతపై ప్రత్యేక దృష్టి పెట్టానని చెప్పినా పెద్దగా ఫలితం కనిపించ లేదు. ఒకప్పటి రతనాల సీమ ఇప్పుడు నిత్య దుర్భిక్ష సీమగా మారడానికి పాలకుల నిర్లక్ష్యమే కారణం అన్న నిరసనలు వినిపిస్తున్నాయి. ప్రాధాన్యత సంగతి అటు ఉంచి విభజన సమయంలో వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజి అంటూ ఇచ్చిన హామీ అమలుకూ దిక్కులేని స్థితి ఏర్పడింది. పునర్ వ్యవస్థీకరణ చట్టంలో పేర్కొన్న అనేక అంశాలు ఎప్పుడు కార్యరూపంలోకి వస్తాయో అంతుపట్టకుండా మారింది. ఎన్నికలప్పుడు పాలక వర్గాలు అరచేతిలో చూపించే స్వర్గం సామాన్య ప్రజానీకానికి ఎండమావి గానే మిగిలిపోయింది. ఊరించే నీటి ప్రాజెక్టులు ఏళ్ల తరబడి సాగుతూనే ఉన్నాయి. ప్రత్యేక ప్యాకేజీలు, అభివృద్ధి పథకాలు కాగితాలకే పరిమిత మయ్యాయి. ఫలితంగా తాగునీటికీ తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. రైతుల కడగండ్లకు అంతులేకుండా పోతోంది. ఉన్న ఊరిలో పనులు లేక, బతకడానికి మరో మార్గం లేక వలసపోతున్న వ్యథా భరిత దృశ్యాలు సీమ జిల్లాల్లో అడుగడుగునా కనిపిస్తున్నాయి. అనంత,కడప తదితర జిల్లాల నుంచి వేలాదిగా కూలీ పనులకు వసలపోతూనే ఉన్నారు. ఈ దయనీయ పరిస్థితిపై స్పందించాల్సిన ప్రభుత్వ తాత్కాలిక ప్రకటను చేసి మిన్నకుంది. ఆ నిర్లక్ష్యంపై అడపాదడపా వామపక్షాలు ఆందోళనలు చేస్తూనే ఉన్నాయి. అప్పుడెప్పుడో ప్రారంభమైన హంద్రీ-నీవా, గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టుల ఫలితాలు ప్రజలకు ఎప్పుడందు తాయో తెలియని స్థితి. ఇప్పటికే పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేసిన ఈ ప్రాజెక్టులపై మరికొంత శ్రద్ధ చూపిస్తే కొంతమేరకైనా సీమ ప్రజల జలార్తి తీరే అవకాశం ఉంది. తక్షణ ప్రాధాన్యత ఉన్న వీటిని విస్మరించారు. హడావిడిగా నిధులు కేటాయించడం పాలకుల హ్రస్వ దృష్టికి, స్వార్థ ప్రయోజనాలకు నిదర్శనంగా భావించాలి. తుంగభద్ర హెచ్‌ఎల్‌సి, పెన్నా- అహోబిలం, తెలుగుగంగ ప్రాజెక్టుల పట్ల వీరిది చిన్నచూపే. వీటిని పూర్తిచేసి సత్వరంగా నీటిని అందించడానికి బదులుగా గోదావరి జలాలను పారిస్తామ నడం, రెయిన్ గన్లతో కరువును పారదోలతామనడం ప్రజలను భ్రమల్లో ముంచే ప్రయత్నంగానే చూడాలి. సీమలో ప్రవహించే చిన్నాచితకా వాగులు, వంకల్లోని నీటిని సద్వినియోగం చేయాలన్న ఆలోచనగానీ, అటువంటి ప్రతిపాదనలు గానీ రాష్ట్ర సర్కారు చేయడం లేదు. ఇప్పటికైనా సీమ అభివృద్ది విషయంలో నేతలు రాజకీయాలకు అతీతంగా పనిచేయగలిగితే కొంతయినా పురోగతి కనిపిస్తుంది.

# మొండి బకాయిలతో పెద్ద దెబ్బ

ముంబయి,మొండి బాకీల భారం సామాన్యులపై భారీగా పడుతోంది. వాటి నష్టాన్ని పూడ్చుకోవడానికే అన్నట్లుగా బ్యంకులు ఖాతాదారులపై ఇష్టం వచ్చినట్లుగా ఛార్జీలు వేస్తున్నారు. కొన్ని కేసుల్లో రుణగ్రహీతలను వదిలి బ్యాక్ అధికారులను బాధ్యులను చేస్తున్నారు. అక్రమ రుణాలకు సహకరించిన బ్యాంక్ అధికారులు మాత్రం ఊచలు లెక్కిస్తున్నారు. ఇలాంటి వారి భరతం పట్టే ఉపాయాలు ఆలోచించడం లేదు. సామాన్యుల రుణాల విషయంలో ముక్కుపిండి వసూలు చేస్తున్న బ్యాంకులు పెద్దల విషయంలో మిన్నకుంటున్నారు. ఇకపోతే ఆయా బ్యాంకులు విధిస్తున్న ఛార్జీలు చూస్తే బ్యాంక్ ఖాతా లేకపోవడమే ఉత్తతమని ప్రజలు భావిస్తున్నారు. మరోవైపు పాతబకాయిల వసూలుకు సంబంధించి నిర్దుష్ట విధానం అవలంబించడం లేదు. మొండి బకాయిదారుల పేర్లను వెల్లడించాలని గతంలో సుప్రీం ఆదేశించిన ఎందుకనో ఆర్‌బిఐ ముందుకు రావడం లేదు. మొత్తంగా మొండిబకాయిల దెబ్బకు బ్యాంకుల నడ్డి విరుగుతోంది. దేశంలోని 50 అతిపెద్ద రుణ ఖాతాల మొండి బాకీల వల్ల వివిధ బ్యాంకులు దాదాపుగా రూ.2.4 లక్షల కోట్లు వదులుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ గతంలోనే విశ్లేషించింది. ఈ నివేదిక ప్రకారం యాబై కంపెనీలకు ఇచ్చిన అప్పుల్లో మొండి బాకీలుగా మారిన మొత్తంలో 60 శాతం మేర రద్దు చేసుకోవాల్సిన దుస్తితి నెలకొంది. వీటి మొండిబకాయిలు రూ.4 లక్షల కోట్ల మేర ఉన్నాయి. 50 కంపెనీల్లో 30 శాతం అప్పులు మెటల్ రంగానివే అని గుర్తించారు. నిర్మాణ రంగం 25 శాతం, విద్యుత్ 15 శాతం చొప్పున బ్యాంకులకు నిరర్థక ఆస్తులను మిగిల్చాయి. 2017 మార్చి 31 నాటికి బ్యాంకుల మొత్తం మొండి బాకీలు రూ.8 లక్షల కోట్లలో ఈ 50 కంపెనీల వాటా దాదాపుగా సగం మేర ఉన్నాయి. మొత్తం నిరర్థక ఆస్తుల్లో కనీసం సగానికి పైగా రుణాలు ఈ రంగా లివే. భారత జిడిపిలో ఇవి 5 శాతం. ఆర్థిక విలువ ఆధారితంగా ఈ రైటా ఫ్ విలువను లెక్కించామని క్రిసిల్ రేటింగ్స్ ప్రతినిధి ఒకరు వెల్లడించారు. చివరిగా తీసుకునే రైటాఫ్ విలువ, బ్యాంకుల అంచనాలు, సబ్సిడరీలు వాల్యు యేషన్, కమోడిటీతో మిలితమయ్యే రంగాల ధరల అవుట్‌లుక్‌తో ప్రభావితమై ఉంటుందని క్రిసిల్ వివరించింది. ఈ కంపెనీలన్నీ వ్యాపారంలో సమగ్రత కలిగిలేవని పేర్కొన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న బ్యాంకింగ్ రంగంలో నూతన విధానాలు అమలు చేయడంలో ఆలస్యం వల్ల బ్యాంకులు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. నిర్వహణ వ్యయం పెరగడం, ప్రాజెక్టులకు తగు సమయంలో అనుమతులు లభించకపోవడం తదితర పరిణామాలు కంపెనీల చెల్లింపులపై ఒత్తిడిని పెంచాయి. ఇప్పటికే బ్యాంకులు మొండి బాకీల కింద కేటాయింపులు చేశాయని క్రిసిల్ రిపోర్టులో పేర్కొంది. తాజాగా మరో 20 శాతం పెంచాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నష్టాలను తట్టుకోవడానికి బ్యాంకులకు సరిపడ మూలధనం అవసరం ఉంటుంది. కొత్త నిధులు లభిస్తేనే రుణాల మంజూరులో వృద్ధికి దోహదం చేయనుంది.

# కమిషన్ల కక్కుర్తి వల్లనే కల్తీ నెయ్యి

తిరుపతి,శ్రీవారి లడ్డూలో కల్తీ నెయ్యి కలవడానికి మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కారణమని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇంతజరుగుతున్న వైకాపా నాయకుల వ్యాఖ్యలు ఏమ్యంగా ఉన్నాయని అన్నారు. ఇంతటి తిరుమల పవిత్రతను దెబ్బతీయడం దారుణమని అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ..వైసీపీ హయాంలో రివర్స్ టెండరింగ్ పేరుతో ప్రభుత్వానికి కోట్ల నష్టం వచ్చిందని తెలిపారు. నష్టాన్ని కప్పిపుచ్చుకోవడానికి కమిషన్ల కోసం వెతికారని.. అప్పటి టీటీడీ ఈవో ధర్మారెడ్డి సలహాతో తిరుమల నెయ్యిపై దృష్టి పెట్టి తక్కువ ధరకే టెండర్ ఇచ్చి కమిషన్ తీసుకున్నారని విమర్శలు గుప్పించారు. కల్తీ నెయ్యిలో వచ్చిన కమిషన్ జగన్‌కు వెళ్లిందన్నారు. తిరుమల పవిత్రతను మంట కలిపింది జగన్‌మోహన్ రెడ్డి అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్మారెడ్డిని టీటీడీ ఈవోగా పెట్టడం సరైన నిర్ణయం కాదన్నారు. ధర్మారెడ్డి వల్లే తిరుమలలో అరాచకాలు జరిగాయన్నారు. కర్ణాటక నెయ్యి టెండర్లను ఎందుకు ధర్మారెడ్డి రద్దు చేశారని ప్రశ్నించారు. లడ్డూ గురించి ఇష్టానుసారం మాట్లాడడం ఇకనైనా మానుకోవాలన్నారు. సుప్రీంకోర్టు సమోటోగా లడ్డూ వ్యవహారంపై విచారణ జరిపించాలని కోరారు. కమ్యూనిస్టులు దేవుడికి వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు.కేంద్రమంత్రి అమిత్ షా వామపక్ష శక్తులను లేకుండా చేస్తున్నారని.. అమిత్ షా క్రిమినల్ అంటూ వ్యాఖ్యలు చేశారు. రాజకీయ సైద్ధాంతిక వ్యవస్థను నాశనం చేయడానికి అమిత్ షా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కత్తితో రాజకీయం చేస్తే కత్తితోనే పోతారని హెచ్చరించారు. లోపాల్ని ఎత్తి చూపేవారిని చంపేయడం సరైంది కాదన్నారు. మోడీకి వ్యక్తిగతమైన పలుకుబడి తగ్గిందన్నారు. నైతికంగా మోడీ ఓడిపోయారన్నారు. మోదీని కొనసాగించకూడదని ఆర్ఎస్ఎస్ నిర్ణయం తీసుకుందని చెప్పారు. బీజేపీ హయాంలో మహిళలపై అరాచకాలు పెరిగిపోయాయని దుయ్యబట్టారు. మోదీ విదేశాలకు ఎందుకు వెళుతున్నారని ప్రశ్నిస్తూ.. భారతదేశానికి మోడీ ఛీఫ్ గెస్ట్ ప్రధానిగా మారారని ఎద్దేవా చేశారు. రాజకీయ నాయకుడిగా వ్యవహరిస్తున్న తమిళనాడు గవర్నర్‌ను రీకాల్ చేయాలన్నారు. పోలవరం నిర్వాసితుల సమస్యలు ముందుగా పరిష్కరించాలని నారాయణ డిమాండ్ చేశారు.

# చెరువుల్లో నిర్మాణాలను కూల్చేందుకు చర్యలు

హైదరాబాద్,సంగారెడ్డి శివారు అమీన్‌పూర్ మునిసిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ భూములు, చెరువులు కుంటల్లో అక్రమ కట్టడాలపై దృష్టి సారించిన హైడ్రా.. అమీన్‌పూర్ పెద్దచెరువు, శంభునికుంట, బందకొమ్ము చెరువుల్లోని అక్రమ కట్టడాలతో పాటు జాబితాను సిద్ధం చేసినట్లు తెలిసింది. వాటికి సంబంధించి నోటీసులు సైతం జారీచేసినట్లు సమాచారం. అక్కడికి కూడా ఏ క్షణాన్నైనా ఎక్స్‌కవేటర్లు ప్రత్యక్షమవు తాయని సమాచారం. అయితే.. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని 993, 630 సర్వే నంబర్లలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిలో ఏకంగా శతం పేద, మధ్య తరగతి వర్గాలే ఉన్నాయి. వారంతా.. తమ గూడు చెదిరిపోతుందేమోనని కంటిమీద కునుకులేకుండా గడుపుతున్నారు. తమను దారుణంగా వంచించిన బిల్డర్లు, అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా అక్రమ కట్టడాలపై ఉక్కుపాదం మోపుతున్న హైడ్రా.. పటాన్‌చెరు పరిధి కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడ గ్రామాలలో ఆదివారం ఉదయం మొదలుపెట్టిన కూల్చివేతలు ఏకధాటిగా 20 గంటలపాటు కొనసాగాయి! హైడ్రా కూల్చివేతలు పగలు, రాత్రి కొనసాగడం ఇదే తొలిసారి. కిష్టారెడ్డిపేట సర్వే నంబర్ 164 ప్రభుత్వ భూమిలో నిర్మించిన ఐదంతస్తుల భారీ షాపింగ్ కాంప్లెక్సులు మూడింటిని.. తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో హైడ్రా అధికారులు నేలమట్టం చేశారు. అలాగే పటేల్‌గూడ సర్వే నంబర్ 12లోని ప్రభుత్వ భూమిలో నిర్మించిన 24 ఇండ్లను పూర్తిస్థాయిలో ధ్వంసం చేసి, శ్లాబులను నేలమట్టం చేశారు. మరో నాలుగు ఇండ్లలో జనాలు ఉండటంతో.. ఖాళీ చేసి వెళ్లిపోవాలని ఆదేశాలు జారీచేశారు. కాగా.. కిష్టారెడ్డిపేటలోని సర్వే నంబర్164లో ఇంకా అనేక అక్రమ కట్టడాలున్నాయి. వాటిపై సస్పెన్స్ కొనసాగుతోంది. అక్కడే.. ప్రభుత్వ భూముల్లో నిర్మించినట్లుగా ఆరోపణలున్న కొన్ని అపార్ట్‌మెంట్ల కూల్చివేతకు సైతం హైడ్రా ఏర్పాట్లు చేస్తోందని ప్రచారం జరుగుతోంది. హైదరాబాద్‌లోని మాదాపూర్ కావూరి హిల్స్‌లో.. పార్క్ స్థలంలో నిర్మించిన అక్రమ షెడ్లను హైడ్రా సిబ్బంది సోమవారం తొలగించారు. కావూరిహిల్స్‌లోని రోడ్ నెంబర్ 36లో.. సర్వే నంబర్ 42, 43, 44, 45లో గల లే-అవుట్‌లో రెండెకరాల పార్కు స్థలం ఉంది. ఆ స్థలంలో కొన్నాళ్లుగా షెడ్లు ఏర్పాటు చేసి జిమ్ నడుపుతున్నారు. అనుమతి లేకుండా కట్టిన ఆ నిర్మాణాలపై కావూరి హిల్స్ అసోసియేషన్ ప్రతినిధులు 8 ఏళ్ల క్రితం హైకోర్టును ఆశ్రయించారు. కూల్చివేయాలని కోర్టు ఆదేశించినా.. జీహెచ్ఎంసీ అధికారులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించారు. కాలనీవాసులు హైడ్రా దృష్టికి తీసుకెళ్లగా సోమవారం ఉదయం బుల్‌డోజర్‌తో కూల్చివేతలు నిర్వహించారు. అక్కడ 2000 గజాల స్థలం స్వాధీనం చేసుకుని.. పార్క్ అభివృద్ధి నిమిత్తం జీహెచ్ఎంసీకి అప్పగించినట్టు హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రకటించారు. కాగా.. జీహెచ్ఎంసీ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే జిమ్ ఏర్పాటు చేసుకున్నామని, ప్రతి నెలా అ÷-ద్దెకూడా చెల్లిస్తున్నామని నిర్వాహకులు వాపోయారు.

## శ్రీలంక నూతన ప్రధానిగా హరిణి అమరసూర్య

కొలంబో,శ్రీలంక నూతన ప్రధానిగా హరిణి అమరసూర్య నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆమె ప్రమాణస్వీకారం చేశారు. సిరిమావో బండారు నాయకే (1994-2000) తర్వాత శ్రీలంకలో ప్రధాని పదవి చేపట్టిన మహిళా నేత హరిణి కావడం విశేషం. నేషనల్ పీపుల్స్ పవర్ కి చెందిన 54 ఏళ్ల హరిణి అమరసూర్యతో ఆ దేశాధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే ప్రమాణ స్వీకారం చేయించారు. అలాగే, మరో ఇద్దరు నేతలను క్యాబినెట్ మంత్రులుగా నియమించారు. దీంతో శ్రీలంకలో దిసనాయకేతో పాటు మొత్తం నలుగురితో కూడిన క్యాబినెట్ కొలువుదీరింది. ప్రధాని బాధ్యతలు చేపట్టిన హరిణికి న్యాయ, విద్య, కార్మిక, పరిశ్రమలు, శాస్త్ర సాంకేతిక శాఖ, ఆరోగ్యం, పెట్టుబడులు వంటి కీలక శాఖలను కేటాయించారు. అధ్యక్ష ఎన్నికల అనంతరం అధికార మార్పిడిలో భాగంగా దినేష్ గుణవర్ధన తన ప్రధాని పదవికి నిన్న రాజీనామా చేసిన నేపథ్యంలో తాజా పరిణామం చోటుచేసుకుంది. శ్రీలంకలోని హక్కుల కార్యకర్తగా, యూనివర్సిటీ అధ్యాపకురాలిగా గుర్తింపు పొందిన హరిణి ఆ దేశ మూడో మహిళా ప్రధానిగా చరిత్ర లిఖించారు. మరోవైపు, ఎన్‌పీపీకి చెందిన ఎంపీలు విజిత హెరాత్, లక్ష్మణ్ నిపునరచ్చి క్యాబినెట్ మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఇటీవల జరిగిన శ్రీలంక అధ్యక్ష ఎన్నికల్లో దిసనాయకే సంచలన విజయం సాధించి శ్రీలంక నూతన అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టిన విషయం తెలిసిందే. ప్రస్తుత పార్లమెంట్‌ను రెండు రోజుల్లో రద్దు చేస్తామని ఆయన సోమవారం వెల్లడించడంతో శ్రీలంకలో ముందస్తు పార్లమెంట్ ఎన్నికలు నవంబర్‌లో జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# తిరుమల పవిత్రతను సవాల్‌గా తీసుకోవాలి !

తిరుమల: తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారం కాస్తా రాజకీయ విమర్శలకు దారితీయడం దారుణం. నిజానికి ఇక్కడ భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి. కోట్లాది మంది హిందువులను దారుణంగా మోసం చేశారు. జగన్ హయాంలో నెయ్యి కల్తీ జరిగిందన్న విషయం తేలినందున..ఎవరు కల్తీ చేశారో..గుర్తించాలి. ఆ సంస్థపై చర్య తీసుకోవాలి. కల్తీ నెయ్యి సరఫరా జరుగుతున్నదని తెలిసీ ఎందుకు ఇలా చేశారన్నది కూపీ లాగాలి. హైందవేతరులు టిటిడి ఛైర్మన్‌గా ఉన్నందున వారికి దీవుడిపైనా, ఆలయ పవిత్రతపైనా పెద్దగా పట్టింపులు, నమ్మకాలు లేకపోవచ్చు. ఇప్పుడు చంద్రబాబు తిరుమల విషయంలో ఓ ప్రత్యేక చట్టం చేసి పవిత్రతను కాపాడేందుకు రంగంఓలకి దిగాలి. హైందవేతరులు ఎవరు కూడా తిరుమల బొర్డు ఛైర్మన్లుగా, సభ్యులుగా ఉండకుండా చట్టం తీసుకుని రావాలి. తిరుమలకు సంబంధించినంత వరకు అన్యమత ఉద్యోగులు అక్క పనిచేయకుండా నిర్ణయం తీసుకోవాలి. అలా ఎవరైనా ఇప్పటికీ ఉంటే వారిని పంపించి వేయాలి. తక్షణ కర్తవ్యంగా ఈ పనిచేసి దెబ్బతిన్న భక్తుల మనోభావాలకు ఉపశమనం కలిగించాలి. ఇక నెయ్య విషయంలో కూడా తిరుమల మరో నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. దేవదేవుడికి కోట్లాది రూపాయల సంపత్తి ఉంది. గోశాలలు ఉన్నాయి. గోవులు ఉన్నాయి. భక్తులు గోవులను దానం చేయడానికి సిద్దంగా ఉన్నారు. అందువల్ల టిటిడి ఆధ్వర్యంలో గోశాలలను నిర్వహించాలి. ప్రత్యేక నెయ్యి, పాల ఉత్పత్తులను తయారు చేసుకునే ప్రయత్నాలకు శ్రీకారం చుట్టాలి. దీంతో గో సంరోణ కూడా జరగగలదు. తిరుమల శ్రీనివాసుడికి డబ్బుల కొదవ లేనందున గోవుల పెంపకం పెద్ద కష్టమేమీ కాదు. శ్రీవారి లడ్డూకున్న పవిత్రతను కాపాడేందుకు ఈ కీలక నిర్ణయం తీసుకోవాలి. తిరుమల ప్రసాదాల నాణ్యత పెంచాలి. ఆచారాలను మరింత పకడ్బందీగా కొనసాగించాలి. రాజకీయాలకు దూరంగా తిరుమల వ్యవహారాలను నడించాలి. తిరుమలో లడ్డూ మొదలుకుని ఏ ప్రసాదం రుచి చూసినా..అద్భుతంగా ఉంటుంది. అది మరోచోట దొరకదు. కానరాదు. ఇదంతా ఆ అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడి మహత్యం అని శ్రీవారి భక్తులు విశ్వసిస్తారు. శతాబ్దాలుగా తన ప్రాశస్త్యం నిలుపుకొంటూ వచ్చిన లడ్డూను నాణ్యతను గత జగన్‌రెడ్డి ప్రభుత్వం దెబ్బతీయగలిగింది. వారి స్వార్థం కోసం తిరుమలను దుర్వినియోగం చేశారు. టిటిడి ఛైర్మన్లుగా క్రిష్టియన్లను నియమించినా సనాతన హిందూ ధర్మ సంస్థలు నోరు మెదపలేదు. అలాగే ఇటీవలి కాలంలో లడ్డూ నాణ్యత దారుణంగా పడిపోయింది. గతంలో తిరుమల లడ్డూ ఘుమఘుమ లు వెదజల్లేవి. ఈ మధ్య కాలంలో ఆ ఘుమఘుమలు మాయమయ్యాయి. లడ్డూ కూడా ఎండిపోయినట్టుగా ఉంటోంది. ఇలా జరగడానికి తిరుమల తిరుపతి దేవస్థానం గత పాలకవర్గం నిర్వాకమే కారణం. నాసిరకం నెయ్యితో పాటు జీడిపప్పు, కిస్మిస్‌లు కూడా నాణ్యమైనవి వాడకపోవడంతో లడ్డూ తన రుచిని,నాణ్యతను కోల్పోయింది. ఇప్పుడు లడ్డూ తయారీకి వాడిన నెయ్యిలో కల్తీ జరిగిందని తేలింది. ఈ మహా పాతకానికి ఎవరు కారణం అన్నది తేల్చాలి. కాంట్రాక్టర్లను ఎందుకు మార్చారన్నది తేలాలి. గత పాలక మండలి రేటు తగ్గించిన కారణంగా నెయ్యి సరఫరాదారులు కల్తీ నెయ్యి సరఫరా చేశారు. నాణ్యమైన ఆవు నెయ్యిని పేరొందిన కంపెనీలు బహిరంగ మార్కెట్‌లో కిలో 800 రూపాయల వరకు విక్రయిస్తుండగా టీటీడీ పాలక మండలి మాత్రం రూ.400 కంటే తక్కువకు



నెయ్యి టెండర్లను ఖరారు చేసింది. ఈ తప్పుడు నిర్ణయం కారణంగానే కల్తీ నెయ్యి సరఫరా అయింది. మహా ప్రసాదాన్ని కలుషితం చేసి భక్తుల మనోభావాలను దారుణంగా దెబ్బతీశారు. ఆ దేవదేవుడికి అపచారం చేశారు. శ్రీవారిపై భయం ఉన్నవాళ్లు ఇలా చేయరు. ఇంతటి దారుణానికి ఒడిగట్టరు. కాసుల కక్కుర్తి కారణంగా ఈ ధరలకు దిగారని తెలుసుకోవచ్చు. భక్తుల సొమ్ము తోనే ప్రసాదాలకు అవసరమైన ముడి సరుకులను కొనుగోలు చేస్తారు. ఇందులో నాణ్యత విషయంలో రాజీపడి కొనుగోలు చేయాల్సిన అవసరం లేదు. అలాంటప్పుడు ఇలా ఎందుకు చేశారన్నది విచారణ చేయించాలి. నెయ్యి కల్తీ జరిగిందా? లేదా? అని నిర్ధారించే ల్యాబ్‌లు తిరుపతిలో లేవు. అందుకే ఇష్టా రాజ్యంగా కల్తీ నెయ్యి సరఫరా సాగింది. నాటి పాలక మండలి చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి,ఈవో ధర్మారెడ్డి.. అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కోసం ఆ దేవదేవుడిని ముడిసరుకుగా వాడుకున్నారు. గత ఐదేళ్లుగా రాజకీయ జోక్యం పెరిగిపోవడంతో శ్రీవారి సన్నిధిలో అవినీతి పేరుపోయింది. విఐపి టిక్కెట్లను కూడా అమ్ముకున్నారంటే ఎంతకు దిగజారారో తెలుసుకోవచ్చు. నాణ్యమైన నెయ్యి కావాలంటే తక్కువ ధరకు ఇవ్వలేమని పేరున్న సంస్థలు స్పష్టం చేసినప్పుడు..ఇతరులు తక్కువకు సరఫరా చేస్తామంటే ఒప్పుకోవడంలోనే గోల్‌మాల్ జరిగింది. కనీస పాపభీతి కూడా లేకుండా దేవుడిపైన నమ్మకంతో భక్తులు సమకూర్చిన సొమ్ముకే కన్నం వేశారు. కమిషన్ల పర్వానికి తెరలేపారు. ప్రముఖులకు దేవుడిపై ఉన్న భక్తిని ఆసరాగా చేసుకొని వ్యక్తిగత పలుకుబడి పెంచుకున్నారు. మొత్తంగా తిరుమలను కలుషితం చేశారు. ఈ క్రమంలో పాలక మండలిలో సభ్యులుగా నియమితులవడానికి పోటీ పెరిగిపోయింది. శ్రీవెంకటేశ్వరుడిపై భక్తితో కాకుండా ఆ దేవదేవుడిని సొంత అవసరాలకు వాడుకోవడానికి ఎంతైనా ఇచ్చి పాలక మండలి సభ్యులుగా నియమితులు కావడానికి కొందరు ప్రయత్నించారు. క్రమంగా టీటీడీ చైర్మన్ పదవి కూడా రాజకీయ పునరావాస కేంద్రంగా మారిపోయింది. అందువల్ల ఈ పద్ధతికి ఇక స్వస్తి పలకాలి. సంస్కణలకు శ్రీకారం చుట్టాల్సిన బాధ్యత చంద్రబాబుదే. తాను శ్రీవారి దయతోనే బతికి బయటపడ్డానని చెబుతున్న చంద్రబాబు తక్షణం హైందవేతరులు, రాజకీయనేతలను టిటిడి ఛైర్మన్ సహా ఇతర పదవులకు దూరంగా ఉంచాలి. హైందవేతర ఉద్యోగులను, దేవుండటే నమ్మకం లేని వారిని అక్కడి నించి పంపించేయాలి. అతిపెద్ద డెయిరీని కేవలం గోవులతో నిర్వహించేలా చేయాలి. అప్పుడే తిరుమల పవిత్రతకు భంగం కలగదు. మొత్తంగా తిరుమల తిరుపతి దేవస్థానాన్ని ప్రక్షాళనకు చంద్రబాబు నడుం బిగించాలి. ఇదో పవిత్ర యజ్ఞంగా చూడాలి.

# అదానీకి శ్రీలంక అధ్యక్షుడు షాక్ ఇవ్వనున్నారా?



న్యూఢిల్లీ,శ్రీలంక కొత్త అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే. 2014లో అక్కడి జేవీపీ పార్టీ అధ్యక్షుడిగా అనుర కొత్త బాధ్యతలు తీసుకున్నారు. అప్పటి వరకు జేవీపీలో ఒక సభ్యుడుగా ఉన్న ఆయన ఆ పార్టీకే అధ్యక్షుడిగా నియమింపబడ్డారు. దీని తర్వాత జేవీపీని దేశ రాజకీయాల్లో యాక్టివ్‌గా ఉంచడంలో అనుర సక్సెస్ అయ్యారు. అయితే ఇది ఆయనకు పెద్దగా ఏమీ ఉపయోగపడలేదు. 2019 ఎన్నికల్లో అనుర కుమార మొదటిసారి అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేశారు. కానీ కేవలం 3శాతం ఓట్లను మాత్రమే సంపాదించుకోగలిగారు. జనతా విముక్తి పెరమునె నేతృత్వంలో నేషనల్ పీపుల్స్ పవర్(ఎన్‌పీపీ) కూటమి అభ్యర్థిగా ఈయన పోటీ చేశారు. అయితే ఐదేళ్ళ తర్వాత మొత్తం చరిత్రను తిరగరాసారు దిసనాయకే. 3 శాతం ఓట్ల నుంచి శ్రీలంక అధ్యక్షుడిగా ఎన్నిక అయ్యేలా ఎదిగారు. ఒడిదుడుకుల్లో ఉన్న శ్రీలంక బాధ్యతలను నెత్తిన ఎత్తుకున్నారు.

అదానీ ప్రాజెక్టు మీద వ్యతిరేకత...

ఇదంతా బాగానే ఉంది కానీ ఇప్పుడు అనుర కుమార శ్రీలంక అధ్యక్షుడు అవడం మన దేశానికి చెందిన అదానీకి చేటు కూర్చేలా ఉంది. అతను అధ్యక్షుడు అవడానికి...అదానీకి ఏమిటి సంబంధ అని ఆలోచిస్తున్నారా...ఇదిగో ఇందుకు. శ్రీలంకలో ఆదానీ కంపెనీ విండ్ అండ్ పర్ ప్రాజెక్టును నిర్వహిస్తోంది. జేవీపీ పార్టీ మొదటి నుంచి దీనికి వ్యతిరేకంగా ఉంది. తాము అధికారంలోకి వస్తే శ్రీలంకలో ఉన్న అదానీ విండ్ అండ్ పవర్ ప్రాజెక్టును రద్దు చేస్తామని అనుర కుమార ముందు నుంచే చెబుతూ వస్తున్నారు. శ్రీలంకకు ఎక్కువ ధరకు విద్యుత్ విక్రయించనున్న ఈ ప్రాజెక్టుకి తాము వ్యతిరేకమని ఆయన చెప్పారు. ఇప్పుడు అధ్యక్షుడు అయిన తర్వాత దీని మీద మరింత పట్టుదలగా ఉంటారనడంలో ఎటువంటి సందేహం లేదు. దాంతో పాటూ జేవీపీ పార్టీ కొంత ఇండియాకు వ్యతిరేకంగానే ఉంది. శ్రీలంకలో ఉంటున్న తమిళుల పట్ల ఈ పార్టీ స్టాండ్ మొదట నుంచి వేరుగానే ఉంది. ప్రస్తుతం శ్రీలంకకు ఇండియా, చైనా భారీగా రుణాలిస్తున్నాయి. ఇందులో చైనా వామపక్ష భావజాలం ఉన్న దేశం. అనుర కుమార పార్టీ అయిన జేవీపీ కూడా వామపక్ష భావజాలం ఉన్నదే. అందుకే ఈ పార్టీ, కొత్త అధ్యక్షుడు భారత్ కన్నా చైనాకే ఎక్కువ అనుకూలంగా ఉండే ఛాన్స్ ఉంది. అందులో భాగంగానే అదానీ పార్టీని వ్యతిరేకించడం అనే టాక్ ఉంది. దాంతో పాటూ ప్రావిన్సులకు మరిన్ని అధికారాలు ఇవ్వాలని చెప్పే ఇండియా - శ్రీలంక ఒప్పందాన్ని జేవీపీ ఎప్పటినుంచో వ్యతిరేకిస్తోంది.

శ్రీలంక తమిళయన్ల పట్లా వ్యతిరేకత...

ఇక శ్రీలంక తమిళియన్ల పట్ల కూడా జేవీపీ వ్యతిరేకంగా ఉంది మొదటి నుంచీ. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఈశాన్య ప్రాంతాల్లో పర్యటించినప్పుడు కూడా అనుర మాట్లాడుతూ..13వ రాజ్యాంగ సవరణను అమలు చేస్తా. నేను మిమ్మల్ని ఓట్లు అడగడానికి ఇక్కడకు రాలేదు. సమాఖ్య విధానం అందిస్తా. నాకు ఓటేయమని అడగడానికి ఇక్కడకు రాలేదు" అన్నారు. ఇది తమిళ వర్గాల్లో నిరాశ కలిగించింది. అయితే, ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో తన మాట మార్చారు అనుర. జూన్‌లో మరోసారి జాఫ్నా వెళ్లినప్పుడు తమిళ రాజకీయ నేతలను కలిశారు. దాని తర్వాత అనుర మాట్లాడుతూ ప్రావిన్షియల్ కౌన్సిల్స్ యథాతథంగా కొనసాగుతాయని చెప్పారు. తన పార్టీ దీనికి వ్యతిరేకం అని తెలిసినా కూడా ఆయన ఈ ప్రామిస్ చేశారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక మరి ఏం చేస్తారో చూడాలి.

ఇరుదేశాల మధ్యా శాండ్ విచ్ అవము..

అయితే ప్రస్తుతం శ్రీలంక అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశాక అనుర కుమార...తాము భారత్, చనాల మధ్య నలిగి పోదల్చుకోలేదంటూ వ్యాఖ్యలు చేశారు. రెండు దేశాలతో సత్సంబంధాలు తమకు అవసరమేనని...అందుకే భౌగోళిక రాజకీయ శత్రుత్వాల మధ్య చిక్కుకోనే పరిస్థితులకు కొలంబో వీలైనంత దూరంగా ఉంటుందని తేల్చిచెప్పారు. తాము ఓ వర్గం పక్షం వహించమని అన్నారు. శ్రీలంక ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఆ దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవాలంటే తటస్థ వైఖరి చాలా అవసరమని అనుర అభిప్రాయపడ్డారు. ప్రపంచ శక్తుల అధిపత్య పోరుకు శ్రీలంక దూరమన్నారు. అదే సమయంలో ఉభయ పక్షాలకు ప్రయోజనకరంగా ఉండేలా దౌత్య, భాగస్వామ్యాలను కుదుర్చుకోవడంపై తాము దృష్టిపెడతామని చెప్పారు.

# రైలు పట్టాలపై కుట్రపూరిత ప్రయత్నాలు

జైపుర్, రైళ్లు పట్టాలు తప్పేలా ఇటీవల కొన్ని కుట్రపూరిత ప్రయత్నాలు వెలుగు చూడటం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. పట్టాలపై ఎల్‌పీజీ సిలిండర్లు, సైకిళ్లు, ఇనుప రాడ్లు, సిమెంట్ ఇటుకలు పెట్టి రైలుకు ప్రమాదం తలపెట్టే ఘటనలు కలకలం రేపాయి. ఇటువంటి వాటిపై రైల్వేశాఖ అప్రమత్తంగా ఉందని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. ఈ తరహా ఘటనలను నిర్మూలించేందుకు అనేక రాష్ట్రాల యంత్రాంగం, పోలీసులతో చర్చలు జరుపుతున్నామన్నారు. రైలు ప్రమాదాలకు ప్రయత్నించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జైపుర్‌లో పలు మార్గాల్లో కవచ్ పనితీరును పరిశీలించేందుకు వచ్చిన రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్.. ఇటీవల వెలుగు చూస్తున్న దుశ్చర్యలపై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వాలు, డీజీపీలు, హోంశాఖ కార్యదర్శులతో చర్చలు జరుపుతున్నాం. ఇందులో ఎన్ఐఏ కూడా భాగస్వామ్యమైంది. అటువంటి ప్రమాదాలకు ప్రయత్నించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇది మా దృఢనిశ్చయం అని అన్నారు. ఇటువంటి ఘటనలపై రైల్వే శాఖ అప్రమత్తంగా ఉందని.. దీనిపై రైల్వే పోలీసులతోపాటు స్థానిక పోలీస్ స్టేషన్లతో అన్ని రైల్వే జోన్ల అధికారులు కలిసి పనిచేస్తున్నారని అన్నారు.

# ఆర్టీసీ ఛైర్మన్‌గా నియమించడం ఆనందదాయకం

మచిలీపట్నం,ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు తనకు సముచిత స్థానం కల్పించారని ఆ పార్టీ నాయకుడు, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ పేర్కొన్నారు. ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్‌గా కొనకళ్ల నారాయణరావును సీఎం చంద్రబాబు నియమించారు. ఈ నేపథ్యంలో మంగళవారం మచిలీపట్నంలో కొనకళ్ల నారాయణరావు స్పందించారు.పార్టీకి చేసిన సేవలను దృష్టిలో పెట్టుకొని తనకు మంచి పదవి ఇచ్చారన్నారు. ఆర్టీసీ చైర్మన్ పదవి తనకు కేటాయించడం ద్వారా సీఎం చంద్రబాబు.. పార్టీలోని నేతలు, కార్యకర్తలకు ఎంత పెద్ద పీట వేస్తారో అర్థమవుతుందన్నారు. కూటమి ప్రభుత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు... తనకు ఏ పదవి అప్పగించినా శక్తివంచన లేకుండా పని చేస్తానని కొనకళ్ల నారాయణ రావు అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తానని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గతంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ క్రమంలో పార్టీ కష్ట కాలంలో ఉన్న సమయంలో కష్టించి పని చేసిన వారిని.. అలాగే ఇటీవల జరిగిన అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో టిక్కెట్ దక్కించుకోలేక పోయిన వారితోపాటు పొత్తుల్లో భాగంగా టిక్కెట్లు త్యాగం చేసిన వారిని దృష్టిలో పెట్టుకుని సీఎం చంద్రబాబు ఈ నామినేటెడ్ పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టారు. అందులోభాగంగా తొలి విడతగా 99 మందిని నామినేటెడ్ పోస్టులకు ఆయన ఎంపిక చేశారు. వారిని వివిధ సంస్థలకు చైర్మన్లుగా నియమించారు. ఆ క్రమంలో ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్‌గా కొనకళ్ల నారాయణను చంద్రబాబు నియమించారు. అయితే 2009, 2014 ఎన్నికల్లో మచిలీపట్నం లోక్‌సభ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా కొనకళ్ల నారాయణ రావు బరిలో దిగి గెలిచారు. 2019 ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. అలాగే ఇటీవల జరిగిన ఎన్నికల్లో మచిలీపట్నం లోక్‌సభ స్థానం టికెట్‌ను.. మిత్రపక్షమైన జనసేన పార్టీకి టీడీపీ కేటాయించింది. దీంతో జనసేన పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచిన వల్లభనేని బాలశౌరి విజయం సాధించిన సంగతి తెలిసిందే. పార్టీకి సేవే కాదు.. ఎంపీ సీటు సైతం త్యాగం చేసిన కొనకళ్లకు సముచిత స్థానం కల్పించాలని చంద్రబాబు నిర్ణయించారు. ఆ క్రమంలో ఆర్టీసీ చైర్మన్ పదవిలో కొనకళ్లను నియమించారు.

# మహిళా కమిషన్ నుంచి గజ్జెల లక్ష్మికి ఉద్వాసన

అమరావతి,ఏపీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ గజ్జెల లక్ష్మికి ప్రభుత్వం ఉద్వాసన పలికింది. ఆమె పదవి కాలం ఆగస్టులోనే ముగియడంతో వెంటనే తొలగించాలని ఏపీ సర్కార్ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు మంగళవారం నాడు సంబంధిత శాఖకు ఆదేశాలు ఇస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. అయితే ఛైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్టు మంగళవారం ఉదయం గజ్జెల లక్ష్మి ప్రకటించారు. ఆమెకు సోమవారమే ప్రభుత్వం నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. ఛైర్మన్‌కు ఉద్వాసన పలకడంతో సభ్యుల పదవి కాలం పూర్తి అయినట్టే అని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. కాగా.. ముంబై నటి కాదాంబరి జెత్వాని కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదంటూ గతంలో గజ్జెల లక్ష్మి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. దీనిపై టీడీపీ నేతలు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇతర రాష్ట్రాల మహిళల విషయంలో తాము జోక్యం చేసుకోలేమని, ఆమె ముంబయికి చెందిన మహిళ కాబట్టి మహరాష్ట్ర మహిళా కమిషన్‌ను ఆశ్రయించాలంటూ వెంకటలక్ష్మి ఇచ్చిన ఉచిత సలహాపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల మహిళల విషయంలో తాము సుమోటోగా కేసు తీసుకోలేమంటూ ఏపీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ చెప్పిన మాటలతో దుమారం చెలరేగింది. ఉన్నత చదువులు చదివిన కాదంబరి ముందుగా ఏపీ మహిళా కమిషన్‌ను ఎందుకు ఆశ్రయించలేదని బాధితురాలిపైనే ఏపీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి ప్రశ్నలు సంధించడంపై సోషల్ మీడియా వేదికగా తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. 'మహిళకు అన్యాయం జరిగితే మాకు సంబంధం లేదని అంటావా. ఏపీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ పదవికి నువ్వు మాయని మచ్చ. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏపీ ఎన్నికలకు ముందు నీకు పదవి వరించింది. వైసీపీ నాయకుల తప్పులు మీకు కనిపించడం లేదా?. ఇతర రాష్ట్ర మహిళలకు మన రాష్ట్రంలో అన్యాయం జరిగితే మహిళా కమిషన్‌కు సంబంధం లేదని అంటారా?. నీ పదవీ కాలం ఇంకో సంవత్సరం ఉంది. ఈ యేడాది పాటు వైసీపీ నాయకులు మహిళలను వేధిస్తే ఇలానే ఏదో ఒక వంక పెట్టుకుని వారిని రక్షిస్తావు. ఇలాంటి క్రిమినల్స్ ను వెనకేసుకు రావడం వైసీపీలో సంప్రదాయంగా మారింది. మేము ట్యాక్సులు కట్టిన డబ్బుతో నీకు ప్రభుత్వం లక్షలు లక్షలు జీతం ఇవ్వడం లేదా?. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుని అసభ్య పదజాలంతో తిడుతూ సోషల్ మీడియాలో పోస్టులు చేస్తావు. మా నుంచి రియాక్షన్ వస్తే టీడీపీ సోషల్ మీడియాపై కేసులు పెడతావు. మళ్లీ మీ పార్టీ 2029లో గెలిస్తే ఇలాంటి నేరస్థులనే ఇంకా పెంచి పోషిస్తుంది' అంటూ ఘాటు విమర్శలు గుప్పించారు.

## ఆర్టీసీ ఛైర్మన్‌గా మాజీ ఎంపి కొనకళ్ల

అమరావతి, ఏపీలో పలు నామినేటెడ్ పోస్టులను భర్తీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 20 కార్పొరేషన్లకు ఛైర్మన్లు, సభ్యులను నియమించింది. ఈ నియమకాల్లో తెదేపాతో పాటు భాజపా, జనసేన నేతలకు ప్రాధాన్యం కల్పించారు. ఆర్టీసీ ఛైర్మన్‌గా తెదేపా మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణను ప్రభుత్వం నియమించింది. వక్ఫ్ బోర్డు ఛైర్మన్‌గా అబ్దుల్ అజీజ్, 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్‌గా లంకా దినకర్, శాప్ ఛైర్మన్‌గా రవినాయుడును ఎంపిక చేసింది. మొత్తం 99 మందితో జాబితాను ప్రకటించింది. ఈ జాబితాలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ప్రభుత్వం చోటు కల్పించింది. పార్టీ కోసం క్షేత్రస్థాయిలో కష్టపడిన సామాన్య కార్యకర్తలకు సీఎం చంద్రబాబు ఈ జాబితాలో పెద్దపీట వేశారు. యువతకు ప్రాధాన్యం కల్పించారు. 11 మంది కస్టర్ ఇన్‌ఛార్జ్‌లు, ఆరుగురు యూనిట్ ఇన్‌చార్జ్‌లకు పదవులు దక్కాయి. ఓ క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌కు ఛైర్మన్ పదవి వరించింది. కార్పొరేషన్-ఛైర్మన్‌ల వివరాలు ఇలా ఉన్నాయి. వక్ఫ్‌బోర్డు- అబ్దుల్ అజీజ్ (తెదేపా), శాప్- అనిమిని రవి నాయుడు(తెదేపా), గృహనిర్మాణ సంస్థ- బత్తుల తాతయ్యబాబు(తెదేపా),ఏపీ ట్రైకార్- బొరగం శ్రీనివాసులు (తెదేపా), ఏపీ మారిటైం బోర్డు- దామచర్ల సత్య (తెదేపా), సీడాప్- దీపక్‌రెడ్డి (తెదేపా), 20 సూత్రాల అమలు కమిటీ- లంకా దినకర్ (భాజపా),మార్క్‌ఫెడ్- కర్రోతు బంగార్రాజు (తెదేపా),సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్- మన్నె సుబ్బారెడ్డి (తెదేపా), ఏపీఐఐసీ- మంతెన రామరాజు (తెదేపా)పద్మశాలి కార్పొరేషన్- నందం అబద్ధయ్య (తెదేపా), ఏపీటీడీసీ- నూకసాని బాలాజీ (తెదేపా), ఏపీఎస్ ఆర్టీసీ- కొనకళ్ల నారాయణ, వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం (తెదేపా),పట్టణాభివృద్ధి, మౌలిక సదుపాయాల కార్పొరేషన్- పీలా గోవింద సత్యనారాయణ (తెదేపా),లెదర్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్- పిల్లి మాణిక్యాల రావు (తెదేపా), వినియోగ దారుల రక్షణ కౌన్సిల్- పీతల సుజాత (తెదేపా),

# విపక్ష పాత్రకు దూరంగా బీఆర్ఎస్ నేతలు!



హైదరాబాద్,రాజకీయాలంటే నిత్యం హంగామా క్షణం తీరిక లేకుండా బిజీబిజీగా గడిపేస్తుంటారు నేతలు. తమ పని లేకున్నా.. తమతో పనిలేకున్నా ఖాళీగా కూర్చోవడమంటే పొలిటీషియన్స్‌కు అసలు కుదరదు. ఏదో పని ఉండాలే.. ఇలా సుమారు ఇరవయ్యేళ్లు బిజీ బిజీగా గడిపిన బీఆర్ఎస్ నేతలు.. ఇప్పుడు ఖాళీగా కనిపిస్తున్నారు.అధికారం కోల్పోయిన తర్వాత ప్రజలతో పనేం ఉన్నాదన్నట్లు ప్రధానమైన నేతలు అంతా సైలెంట్ అయిపోయారు. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీనియర్ నేత హరీశ్ రావు తప్పించి మిగిలిన నేతలు భూతద్దం పెట్టి వెదికినా క్షేత్రస్థాయిలో కనిపించడం లేదట.. అధినేత కేసీఆర్‌తో సహా బీఆర్ఎస్ నేతలు బయటకి ఎందుకు రావడం లేదు. బీఆర్ఎస్‌లో ఏం జరుగుతోంది?తెలంగాణలో ప్రధాన ప్రతిపక్ష పార్టీ నేతలకు ఏ పనిలేకుండా పోయిందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వాన్ని అనుక్షణం కనిపెడుతూ ప్రజలకు రక్షణగా నిలవాల్సిన బీఆర్ఎస్ నేతలు ఆ పనిచేయడం లేదన్న విమర్శలే ఎక్కువగా వినిపిస్తున్నాయి. అధికారం గల్లంతై 9 నెలలు అవుతున్నా నూటికి 90 శాతం మంది బీఆర్ఎస్ నేతలు ప్రజల్లో కనిపించడం లేదనే వ్యాఖ్యలే వినిపిస్తున్నాయి.

**హడావుడి చేస్తున్న నేతలు.. ఆ తర్వాత మాత్రం..**

ముఖ్యనేతలు కేటీఆర్, హరీశ్‌రావు పర్యటనల్లో హడావుడి చేస్తున్న నేతలు ఆ తర్వాత క్యాడర్‌కు అందుబాటులో ఉండటం లేదని చెబుతున్నారు. ముఖ్యంగా పార్టీని నడిపే విషయంలో హైకమాండ్ నుంచి ఎలాంటి దిశానిర్దేశం లేకపోవడంతోనే బీఆర్ఎస్ నేతలు ఇలా ఇళ్లకే పరిమితమవుతున్నారనే టాక్ కూడా వినిపిస్తోంది.టీఆర్ఎస్‌గా ఉన్న సమయం నుంచి నేతలకు చేతినిండా పనిఉండేది. అధినేత కేసీఆర్ పార్టీ స్థాపించిన సమయంలో ఉద్యమించి రాష్ట్రం మొత్తం కదం తొక్కిన గులాబీ శ్రేణులు%8% 2014లో తొలిసారి అధికారంలోకి వచ్చిన నుంచి 2018 వరకు దాదాపు పదేళ్లు బిజీబిజీగా ఉండేవారు. అధినేత కేసీఆర్ కూడా నేతలకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వడంతో జిల్లాల్లో నిత్యం బీఆర్ఎస్ నేతల హడావుడి కనిపించేది. కానీ, అధికారం కోల్పోయిన తర్వాత బీఆర్ఎస్‌లో మునుపటి పోరాట పటిమ కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా పార్టీ కార్యక్రమాల నిర్వహణలో హైకమాండ్‌కే స్పష్టమైన విధానం లేకపోయిందనే ఆరోపణలు వస్తున్నాయి.రాష్ట్రంలో అధికార కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ప్రతిపక్ష స్థానంలో బీఆర్ఎస్ స్థాయికి తగ్గ ప్రదర్శన చేయడం లేదన్న విమర్శలు పార్లమెంట్ ఎన్నికల ముందు నుంచీ వినిపిస్తున్నాయి. ప్రధానంగా అధినేత కేసీఆర్ ఫాం హౌస్‌కే పరిమితమైపోవడం%8% సీనియర్ నేతలు ఎవరూ పార్టీ కార్యాలయం వైపు చూడటం కూడా మానేశారంటున్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడే విషయంలో ఇంకో విపక్షం బీజేపీ నుంచి బీఆర్ఎస్ గట్టి సవాలే ఎదుర్కొంటోందని చెబుతున్నారు.

**హైడ్రా విషయంలో?**

ప్రస్తుతం హైదరాబాద్‌లో హీట్ పుట్టిస్తున్న హైడ్రా విషయంలో బీఆర్ఎస్ వెనకబడిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఈ విషయంలో కేటీఆర్, హరీశ్ రావు తప్ప మిగిలిన నేతలు ఎవరూ మాట్లాడటం లేదని అంటున్నారు. ఇక రైతు రుణమాఫీ, గ్యారెంటీల అమలు విషయంలోనూ కేటీఆర్, హరీశ్ రావు తప్ప మిగిలిన బీఆర్ఎస్ నేతలు మాటలు ఎక్కడా వినిపించడం లేదంటున్నారు. దీనివల్ల పార్టీ క్యాడర్‌లో అయోమయం కనిపిస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఎన్నికల్లో ఓటమిపై చాలా నియోజకవర్గాల్లో ఇంతవరకు ఒక్క సమీక్ష కూడా నిర్వహించలేదంటే బీఆర్ఎస్ పరిస్థితి ఏ విధంగా తయారైందో అర్థం చేసుకోవచ్చంటున్నారు పరిశీలకులు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడినా.. పోరాడితే పార్లమెంట్ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు వచ్చేవని.. కానీ, అప్పుడు అస్త్రసన్యాసం చేసినట్లు బీఆర్ఎస్ నేతలు వ్యవహరించడం వల్ల చరిత్రలో లేనటువంటి ఓటమిని ఎదుర్కోవాల్సివచ్చిందని చెప్పుకుంటున్నారు.ఇక ఇప్పుడైనా తేరుకుని కోల్పోయిన వైభవాన్ని తిరిగి పొందాలంటే ఏం చేయాలనే అంశమై పార్టీలో చర్చ జరగాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఐతే పిల్లి మెడలో గంట కొట్టేదెవరు అన్నట్లు అధినేత కేసీఆర్ అడుగు తీసి బయట పెట్టకపోవడం.. పార్టీ పరంగా ఏ కార్యక్రమం చేస్తే ఏం జరుగుతుందోననే అయోమయం నేతలను వెనక్కి లాగుతుందంటున్నారు.ఇదే సమయంలో గతంలో ప్రోత్సహించిన వలసలు కూడా ఇప్పుడు పార్టీని ఇబ్బందికి గురిచేస్తున్నట్లు చెప్పుకుంటున్నారు. అవసరం ఉన్నా, లేకపోయినా గతంలో కాంగ్రెస్ నుంచి వలసలను ప్రోత్సహించడం.. ఎన్నికల ముందు వర్గ విభేదాలకు కారణమైందని.. ఇక అధికారం కోల్పోయిన తర్వాత సొంత పార్టీ వారితోపాటు వలస వచ్చిన నేతలు తిరిగి కాంగ్రెస్ గూటికి చేరిపోవడంతో చాలాచోట్ల పార్టీ దెబ్బతిన్నాదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో పార్టీ బలోపేతానికి బీఆర్ఎస్ నాయకత్వం ఎలా ముందుకు వెళుతుందనేదే ఆసక్తికరంగా మారింది.

# లడ్డూ ప్రసాదం విషయంలో సిట్ ఏమి తేల్చబోతోంది ?



అమరావతి,తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవారి లడ్డూ ప్రసాదం విషయంలో కల్తీ జరిగింది ఏకంగా ముఖ్యమంత్రి స్థాయిలోనే తీవ్ర ఆరోపణలు రావడంతో గత వారం రోజులుగా దేశమంతా అట్టుడికిపోతోంది. ఈ నేపథ్యంలో కల్తీ జరిగిందా లేదా అన్నది తేల్చాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది.అనుమానాలు అయితే సర్వత్రా వ్యాపించాయి. దాని మీద ఎవరి మటుకు వారు కథనాలు అల్లుతున్నారు. అయితే నిజం బయటకు రావాలి. అసలు ఏం జరిగింది అన్నది లోకానికి తెలియాలి. ఏపీలో నాలుగు నెలలుగా టీడీపీ కూటమి ప్రభుత్వం ఉంది.చరిత్రలో తొలిసారిగా టీటీడీ ప్రసాదం అపవిత్రం అయింది అని ముఖ్యమంత్రి చంద్రబాబు.అయితే ఆరోపణలు వేరు ఆధారసహితంగా నిగ్గు తేల్చడం వేరు. దాని కోసం సమగ్రమైన సంపూర్ణమైన దర్యాప్తు అవసరం. దాని కోసం టీడీపీ కూటమి ప్రభుత్వం అయితే సిట్ ని నియమించింది. సిట్ చీఫ్ గా సర్వశ్రేష్ట త్రిపాఠిని నియమిస్తూ తాజాగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.త్రిపాఠి ప్రస్తుతం గుంటూరు రేంజి డీఐజీగా ఉన్నారు. ఆయన నాయకత్వం సిట్ పనిచేస్తుంది. సిట్ తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీ అయిందా లేదా అన్నది తేలుస్తుంది అంటున్నారు. అయితే ఇక్కడ అనేక డౌట్లు వ్యక్తం అవుతున్నాయి. గత అయిదేళ్లలో శ్రీవారి లడ్డూ తయారీ కోసం వాడిన నెయ్యి అలాగే ఇతర పూజ కార్యక్రమాలకు వాడిన నెయ్యిలో కల్తీ చోటు చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.అంతే కాదు జంతువుల కొవ్వు నెయ్యిలో కలిసింది అని ఆరోపణలు ఉన్నాయి. ఇవి తీవ్రమైనవి. అయితే గతంలో వాడిన నెయ్యి అయితే ఇపుడు లేదు, ఆ లడ్డూలూ లేవు, మరి ఏ విధంగా కల్తీ జరిగింది అన్నది సిట్ నిరూపిస్తుంది అన్నది ఒక చర్చగా ఉంది. అయితే లడ్డూ పోటులో పనిచేసే ఉద్యోగులకు అక్కడ ఉన్న సిబ్బందిని ఇతరులకు సిట్ పశ్నించే అవకాశం ఉంది.కాకుండా అన్నప్రసాదం తో పాటు ఇతర పూజాదికాల కోసం వాడిన నెయ్యి అక్కడ ఉన్న సిబ్బందిని కూడా విచారిస్తుంది. వారు చెప్పే విషయాలను సిట్ నమోదు చేసుకుని ఒక కంక్లూజన్ కి వస్తుంది అని అంటున్నారు. కానీ ఇది సమగ్రమైన దర్యాప్తు అవుతుందా అన్నది కూడా చర్చనీయాంశమైందిఎందుకంటే పాత నెయ్యి ఉంటే దానిని సేకరించి ల్యాబ్స్ కి పంపి టెస్ట్ చేయిస్తే అపుడు గతంలో కూడా ఇదే వాడారు అని చెప్పవచ్చు. కానీ నెయ్యి ఉండదు, అలాగే అప్పటి లడ్డూలు ఇపుడు ఉండే ఛాన్స్ లేదు. అవి పూర్తిగా పాడైపోతాయి కూడా.మరి విచారణ అంతా పనిచేసే వారు చెప్పే దాని మీదనే చూడాలి సాగుతుందా అన్నది కూడా. ఇంకో విషయం ఏమిటి అంటే సిట్ చీఫ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుంది. లడ్డూలో నెయ్యి కల్తీ అయిందని జంతువుల కొవ్వు కలిసిందని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఆయనను కాదని ఇది తప్పు అని చెప్పే పరిస్థితి సిట్ కి ఉంటుందా అన్నది మరో కీలకమైన పాయింట్.అందుకే సిట్ విచారణలో ఏం తేల్చబోతోంది అన్నదే ఇప్పుడు చర్చగా మారింది. దానికి బదులుగా సీబీఐ విచారణ జరిపిస్తే ఇంకా లోతుగా మూలాల్లోకి వెళ్లి వారు దర్యాప్తు చేసే అవకాశం ఉందని అంటున్నారు. వీటన్నింటి కంటే న్యాయ విచారణలో పూర్తి సమాచారం వస్తుందని అన్న వారూ ఉన్నారు. అపుడే భక్తుల గాయపడిన భక్తుల మనోభావాలకు ఒక సమాధానం లభిస్తుంది.ఇంకో వైపు చూస్తే తటస్థ సంస్థల నుంచే దర్యాప్తు జరగాలని కూడా అంటున్నారు. ఎందుకంటే తిరుపతి లడ్డూలో కల్తీ జరిగింది అన్నది ఆధ్యాత్మిక కోణం నుంచి రాజకీయ కోణం వైపుగా మళ్లింది. రెండు పార్టీలుగా రాజకీయం విడిపోయింది. దాంతో ప్రభుత్వం ఆధ్వర్యంలో సిట్ ఇచ్చే నివేదికను సహజంగానే వైసీపీ నో చెబుతుంది. అలాగే ఒక సెక్షన్ ఆఫ్ భక్తులలోనూ పూర్తి విశ్వసనీయత ఉండదు. ఇలా రెండు వైపులా కాకుండా మూడో పక్షం చేస్తే విచారణ ద్వారానే నిజాలు బయటకు వస్తాయని అంటున్నారు. మరి ఆ దిశగా ఏమైనా జరుగుతుందా అన్నదే చూడాల్సి ఉంది.

# టీటీడీ చైర్మన్ గిరీ...ఎపుడు రామా హరీ ?



తిరుమల,తిరుమల తిరుపతి శ్రీవారి లడ్డూ ప్రసాదంలో పెద్ద ఎత్తున కల్తీ జరిగిందని దేశమంతా లొల్లి జరుగుతున్న వేళ నామినేటెడ్ పదవులను టీడీపీ కూటమి ప్రకటించింది. అయితే అందులో టాప్ ప్రయారిటీ లో ఉండాల్సిన టీటీడీ బోర్డు నియామకం అయితే కనిపించలేదు.ఇది ముందే అంతా ఊహించారు. నిజామికి నంబర్ వన్ పోస్ట్ అది. టీటీడీ చైర్మన్ అంటే మంత్రి పదవి కంటే ఎక్కువ. అలాంటి పోస్టు కోసం ఎందరో ప్రయత్నాలు చేశారు. కానీ అందరి ఆశలను పక్కన పెడుతూ నామినేటెడ్ పందేరం స్టార్ట్ చేశారు. తొలుత ఇరవై కార్పోరేషన్ చైర్మన్ పదవులను అందులోని పాలక మండలిని భర్తీ చేశారు.కానీ టీటీడీ బోర్డు ఊసు మాత్రం ఎత్తలేదు. అంతే కాదు వంద దాకా ఉన్న చైర్మన్ పదవులలో ఏపీలో ఉన్న అతి పెద్ద దేవాలయాల బోర్డులు కూడా ఉన్నాయి. వాటికి కూడా పాలక మండళ్ళను ప్రకటించలేదు. శ్రీవారి లడ్డూ ప్రసాదం ఊసు లేకపోతే మాత్రం ఈపాటికి అందులో చాలా వరకూ ప్రకటించి ఉండేవారుఒక వైపు హిందూ ధార్మిక సంస్థలు మండిపడుతున్న వైనం ఉంది. లడ్డూ ప్రసాదం లో కల్తీ జరిగింది అని భక్తుల మనోభావాలు కూడా తీవ్రంగా గాయపడిన నేపథ్యం ఉంది. పైగా దేవాలయాల పాలనా బాధ్యతలు ధార్మిక సంస్థలకు అప్పగించాలని కోరుతున్నారు. దాంతో ఇపుడు ఆ రచ్చ ఎందుకు అని అనుకున్నారో ఏమో కానీ పక్కన పెట్టేశారు.దాని ఫలితంగా టీటీడీ చైర్మన్ పోస్టు కూడా ఎవరికీ దక్కకుండా పోయింది. ఈ భారీ పోస్ట్ భర్తీ చేయడం ఇప్పట్లో అయ్యేలా కనిపించడం లేదు. లడ్డూ ప్రసాదం కల్తీ వ్యవహారం ఒక కొలిక్కి వచ్చాక అపుడు తాపీగా చేపడతారు అని అంటున్నారు. అంటే 2025 లోకి క్యాలెండర్ మారాల్సిందే అంటున్నారు.అలా ఆశావహుల నోట్లో లడ్డూ ప్రసాదం కల్తీ ఇష్యూ మట్టి కొట్టినట్లు అయింది అని అంటున్నారు. ఇదిలా ఉంటే టీటీడీ పాలకమండలితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 27 వేల దేవాలయాల పాలకమండళ్లను త్వరలోనే నియమిస్తామని రాష్ట్ర దేవాదా య శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెబుతున్నారు.లడ్డు ప్రసాదం వివాదంతో పాటు తిరుమలలో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం సిట్ దర్యాప్తు నకు ఆదేశించిందని కూడా మంత్రి తెలిపారు. సిట్ నివేదిక వచ్చిన తరువాత విజిలెన్స్, సిట్ నివేదికలపై ప్రభుత్వం పరిశీలన జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని మంత్రి వివరించారు. రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో నెయ్యితో పాటు ముడి సరుకులను, నాణ్యతను పరిశీలించాకే వినియోగిం చాలని ఆలయ అధికారులకు ఆదేశించామని వెల్లడించారు.ఇలా మంత్రి స్టేట్మెంట్ ఉంది. కానీ దేవాలయాల విషయంలో అయితే ఇపుడు సీరియస్ గానే అంతా చూస్తారు. అలాగే కేంద్రంలో ఉన్న బీజేపీ కూడా రాజకీయ పునరావాస కేంద్రాలుగా ఇక మీదట ఆలయ పాలక మండళ్ళను వాడుకోవడా నికి సమ్మతించే సూచనలు లేవు అని అంటున్నారు.మొత్తం మీద చూస్తే టీటీడీ బోర్డు తో పాటు అతి ముఖ్య అలయాల చైర్మన్ పదవులు పూర్తిగా పెండింగులో పడినట్లుగా చెబుతున్నారు. ఈ విధంగా చూస్తే కూటమికి దక్కాల్సిన చాలా పదవులు కూడా తగ్గిపోయాయని అంటున్నారు. ఇపుడు ఉన్న పదవుల సర్దుకోవాల్సి ఉంటుంది. దాంతో కూటమిలో మూడు పార్టీలకు ఏ విధంగా న్యాయం జరుగుతుంది ఏ విధంగా సర్దుబాటు చేసు కుంటారు అని చూడాల్సిందే.

# కామ్రేడ్స్ వైపు వైసీపీ ?



అమరావతి,ఏపీలో దాదాపుగా ఒంటరి పోరాటం చేస్తున్న వైసీపీకి ఇపుడు అంతా ప్రతికూలంగా మారింది. ఏ ఒక్కరూ మొర ఆలకించని పరిస్థితి. దానికి తోడు బలమైన కూటమి ప్రభుత్వం ఉంది. ఏపీలో వారిదే అధికారం. దాంతో జగన్ కి 2014 నుంచి 2019 వరకు జరిగిన ప్రతిపక్ష పాత్ర కాదు, ఆ హోదా లేదు, ఆ హవా లేదు అని తొందరలోనే అర్థం అవుతోంది అని అంటున్నారు.చిత్రమేంటి అంటే సొంత పార్టీ వారే నమ్మక పార్టీని వీడిపోతున్నారు. మరో వైపు అపర చాణక్యుడు చంద్రబాబు వేస్తున్న బాణాలు సంధిస్తున్న అస్త్రాలు తట్టుకోవడం కష్టసాధ్యమే అని అర్థం అవుతోంది అంటున్నారు.వైసీపీ ఓడి కేవలం మూడు నెలలు మాత్రమే అయింది. కానీ ఇంతలోనే వైసీపీ ప్రతిష్ట పాతాళానికి దిగజారేలా బాబు పదునైన వ్యూహాలతో కొట్టిన చోట కొట్టకుండా భారీగానే దెబ్బ కొడుతోంది అని అంటున్నారు.చంద్రబాబు ఏ విధంగా చూసినా 2014 నాటి పాత సీఎం అయితే కాదు. అప్పట్లో ఆయన జగన్ ని లైట్ తీసుకున్నారు. కానీ 2019 ఓటమి తరువాత ఆ స్కోప్ అయితే అసలు ఇవ్వదలచుకోలేదు. జగన్ ని ఏ విధంగానూ రాజకీయంగా లేవనీయకూడదు అని ఆయన ఎన్నికల ఫలితాలు వచ్చిన మరుక్షణమే నిర్ణయించుకున్నారు అని అంటున్నారు.దానికి అనుగుణంగా ఆయన ఉన్నారు. సర్వ పాపాలను జగన్ కి అంటగడుతున్నారు. సమాజంలోని వివిధ సెక్షన్లలో వైసీపీ మీద సానుభూతి పోయే విధంగా చేస్తున్నారు. వివిధ రంగాలలో శ్వేత పత్రాల రిలీజ్ కూడా అందులో భాగమే. ఏపీని సర్వ నాశనం చేసిన భూతం జగన్ అంటున్నారు ఆయన రాజకీయంగా ఉండకూడదు అని ఓపెన్ గానే చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీ ఎంత కాలం ఒంటరి పోరాటం అని కూడా ఉంది. ఇక శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగింది అన్నది వైసీపీని షేక్ చేసి పారేసింది. దీని నుంచి బయటపడే మార్గం లేక ఉక్కిరి బిక్కిరి అవుతోంది.ఈ సమయంలో వైసీపీకి మద్దతుగా నిలిచే పార్టీలు ఏ ఒక్కటీ లేవు. అయితే కామ్రేడ్స్ మాత్రమే కొంత ఊరటను ఇచ్చేలా తీరుని కలిగిస్తున్నారు. సీపీఎం అయితే ఈ విషయంలో బాహాటంగానే కూటమి నేతల మీద ఫైర్ అవుతోంది. తప్పు జరిగితే విచారణ జరిపించాలని దీనిని వేరే విధంగా వాడుకోవడమేంటి అని కూడా అంటోంది.లడ్డూల పేరుతో రాజకీయ సరికాదు అని సీపీఎం పొలిట్ బ్యూరో మెంబర్ బీవీ రాఘవులు అన్నారు. విజయవాడలోని ఏచూరి సీతారాం సంస్మరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కల్తీగా రుజువు అయితే బాధ్యులపై చర్యలు తీసుకున్నారు.ఈ కులం మతం వంటి వాటికి ఆపాదించి లౌకిక తత్వాన్ని దెబ్బతీయరాదు అని ఆయన ప్రభుత్వానికి సూచించారు. ఆయన వ్యాఖ్యలు అయితే వైసీపీకి ఎంతో స్వాంతనను కలిగించాయి అని అంటున్నారు. మరో వైపు చూస్తే వైసీపీ నేతలు కూటముల సంగతి పక్కన పెట్టి ఏపీలో పోరాటాలు గట్టిగా చేయాలి అంటే కమ్యూనిస్టులతో కలసి ముందుకు పోవాలని చాలా కాలంగా చెబుతూ వస్తున్నారు అని ప్రచారం సాగుతోంది.గతం ఎలా ఉన్నా ఇపుడు వాస్తవాలు వైసీపీ అధినాయకత్వానికి అవగతం అవుతున్నాయని అంటున్నారు. అధినాయకుడు మతాన్ని అడ్డం పెట్టుకుని రాజకీయం చేయడం దాంతో పాటు కార్నర్ చేయడం ఇవన్నీ చూస్తుంటే ఏపీలో లౌకిక వాదం అనే దాని పెద్ద గొంతుకతో వినిపించే కామ్రేడ్స్ తో ఉంటేనే సేఫ్ అన్న మాట వైసీపీలో వినిపిస్తోంది.మరి ఈ విషయంలో వైసీపీ హై కమాండ్ ఏ విధంగా నిర్ణయం తీసుకుంటుంది అన్నది చూడాల్సి ఉంది. ఏది ఏమైనా కామ్రేడ్స్ తో కలసి నడిస్తే మాత్రం వైసీపీ ఉద్యమాలు కానీ పోరాటాలు కానీ పదునెక్కుతాయని అపుడే గట్టిగా ఏపీలో నిలబడగలరని అంటున్నారు. ఇక కామ్రేడ్స్ తో కలిస్తే ఫ్యూచర్ లో ఇండియా కూటమిలో కూడా చేరే అంశం ఆప్షన్ గా ఉంచుకోవచ్చు అన్న మాట కూడా ఉంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో. వైసీపీ ఏ విధంగా వ్యవహరిస్తుందో.

# 14 మంది ఖైదీలను విడుదల చేయాలని ఎల్జీకి ప్రతిపాదన పంపిన ఢిల్లీ ప్రభుత్వం



న్యూఢిల్లీ, ఢిల్లీ ప్రభుత్వం 14 మంది ఖైదీల ముందస్తు విడుదల ప్రతిపాదనను ఎల్జీ వినయ్ కుమార్ సక్సేనా ఆమోదం కోసం పంపింది. హెూం మంత్రి కైలాష్ గెహ్లాట్ ఈ ప్రతిపాదనను ఆమోదం కోసం ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషికి పంపారు.దీని తర్వాత అది ఎల్జీకి పంపబడుతుంది. మొత్తం 92 కేసులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత 14 మంది ఖైదీలను ముందస్తుగా విడుదల చేయాలని సెంటెన్స్ రివ్యూ బోర్డు సిఫార్సు చేసిందని ఢిల్లీ ప్రభుత్వం తెలిపింది. ఈ ఖైదీలలో జైలులో మెరుగుదల, పశ్చాత్తాపం సంకేతాలను చూపించిన వారు ఉన్నారు.ఈ ఖైదీలను ముందస్తుగా విడుదల చేయడం వల్ల వారు సమాజంలోని ప్రధాన స్రవంతిలో చేరడానికి మరో అవకాశం ఇవ్వడమే కాకుండా, జైళ్లపై పెరుగుతున్న భారాన్ని తగ్గించడంలో ఇది చాలా దోహదపడుతుందని హెూం మంత్రి కైలాష్ గెహ్లాట్ అన్నారు. ఇంతకు ముందు కూడా, ఈ సిఫార్సు ఒకసారి చేయబడింది.. అయితే ఈ సిఫార్సును ముఖ్యమంత్రి ద్వారా పంపాలని అభ్యర్థిస్తూ ఎల్జీ తిరిగి పంపారు.

**సీఎం ఆమోదం తర్వాత**

ఈసారి ముఖ్యమంత్రి అతిషి ఆమోదం పొందిన తర్వాత 24 సెప్టెంబర్ 2024న లెఫ్టినెంట్ గవర్నర్‌కు మళ్లీ ప్రతిపాదన పంపబడింది. ఫిబ్రవరి 23న జరిగిన శిక్షల సమీక్ష బోర్డు సమావేశం ఢిల్లీ హెూం మంత్రి కైలాష్ గెహ్లాట్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో అడిషనల్ చీఫ్ సెక్రటరీ (హెూమ్), డైరెక్టర్ జనరల్ (జైళ్లు), ప్రిన్సిపల్ సెక్రటరీ (లా), చీఫ్ డిస్ట్రిక్ట్ జడ్జి, స్పెషల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ మరియు డైరెక్టర్ ఆఫ్ సోషల్ వెల్ఫేర్, ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

# అత్యంత వైభవంగా దసరా మహోత్సవాలు..



విజయవాడ:విజయవాడ ప్రజలు వరద వల్ల కొన్ని ఇబ్బందులు పడ్డారని, అమ్మవారి ఆశీస్సులు, ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి వల్ల ఆ ఇబ్బందులను అధికమించి దసరా మహోత్సవములు నిర్వహించుకోవటం ఆనందంగా వుందని విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేసినేని శివనాథ్ పేర్కొన్నారు.దసరా శరన్నవరాత్రులను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు సకల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఇంద్రాకిలాద్రి పై డీఈవో ఆఫీస్ లో మంగళవారం దసరా మహోత్సవములు -2024 బ్రోచర్ ను ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే సుజనా చౌదరి, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము , దుర్గ గుడి ఈవో రామారావు తో కలిసి ఆవిష్కరించారు.ఆవిష్కరణ కార్యక్రమం అనంతరం అందరూ కలిసి అమ్మవారి దర్శనం చేసుకుని ఆశీర్వచన మండపంలో తీర్థప్రసాదాలు అందుకున్నారు. బ్రోచర్ ఆవిష్కరణ అనంతరం ఎంపి కేశినేని శివనాథ్ మాట్లాడుతూ అక్టోబర్ 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరిగే దసరా మహోత్సవాలకు అందరికీ ప్రత్యేక ఆహ్వానం అన్నారు.భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చూసుకునేందుకు, దసరా మహోత్సవములు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఒక కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులందరూ అమ్మవారిని వరద ముంపుల నుంచి విజయవాడ నగరాన్ని రక్షించాలని ప్రార్థించాలని ఎం.పి కేశినేని శివ నాథ్ కోరారు.మాజీ కేంద్రమంత్రి, ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండ అన్ని సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగింది.. అలాగే భక్తుల సౌకర్యార్థం కాల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే భక్తులకు ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా తగు నిర్ణయాలు తీసుకున్నట్లు చెప్పారు.దసరా నవరాత్రుల మహోత్సవములకి సంబంధించి భక్తులు వారి సలహాలు ఇవ్వవచ్చన్నారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ ఇంద్రకీలాద్రి పై ప్రతి ఏడు దసరా ఉత్సవాలు జరుగుతాయి కానీ ఈఏడాది అత్యంత వైభవంగా జరగనున్నట్లు తెలిపారు.విజయవాడ ప్రజలందరూ వరద ముంపుతో బాధ పడ్డారని,.. సీఎం చంద్రబాబు నాయుడు కృషి, చొరవ వల్ల ప్రజలు, నగరం అంతా సాధారణ స్థితికి వచ్చిందన్నారు. ఆ విపత్కర పరిస్థితి నుండి బయటకు వచ్చి ఉత్సవాలు చేసుకుంటున్నామంటే అది అమ్మవారి దయ,ఆశీస్సులు వుండటం వల్లే అన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బొమ్మసాని సుబ్బారావు , తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎం ఎస్ బేగ్ , ఎన్టీఆర్ జిల్లా బిజెపి అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

## టీచర్ అసభ్య ప్రవర్తనపై ఆందోళన

కామారెడ్డి,కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జీవన్‌దాన్ పాఠశాల వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. సభ్య సమాజం తలదించుకునేలా అభం, శుభం తెలియని ఆరేండ్ల పాపపై పీఈటీ లైంగికదాడికి యత్నించాడు. యూకేజీ విద్యార్థి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడని ఆరోపిస్తూ పాఠశాల వద్ద పాప బంధువులు గొడవకు దిగారు. కీచక ఉపాధ్యాయుడుని అరెస్టు చేయాలంటూ విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాల వద్ద నిరసన చేపట్టడంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించిన టీచర్‌ను శిక్షించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com